Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 06.09.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# పాతమిత్రులే నా ప్రాణవాయువు

## జిల్లాలో 4రోజులు వెంకయ్య పర్యటన

(వివరాలు 5, 12 పేజీలలో)

ఆగమనం



ఆత్మీయం



ఆధ్యాత్మికం





## పేలుతున్న పవన్

### సది బాబు సేవలోనే...

ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత చంద్రబాబుకు టిడిపి నాయకులే చాలామంది చాలా దూరంగా వుంటున్నారు. కొందరైతే పార్టీ కూడా మారారు. ఇంకొందరు పార్టీలు (మిగతా 11వ పేజీలో)

• పారదర్శకతకు పెద్దపీట.. నీతివంతమైన పాలనకు రాచబాట

# అవినీతిపై అంకుశమే!



- అవినీతి సొమ్ము లేదని కొందరు వైసిపి నేతల ఆవేదన
- ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడు సంపాదించుకోవాలనే వాదన
- ఆరునూరైనా నీతి మార్గాన్ని వదిలేదిలేదంటున్న జగన్

ఎన్నికల ప్రచారంలోనూ, ఇంటర్వ్యూలలోనూ వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే నీతివంతమైన పాలన అందిస్తానని చెబితే చాలా మంది నవ్వారు. ప్రభుత్వ వ్యవస్థల్లో నెలకొన్న అవినీతిని అంతమొందించడమే తన లక్ష్యమని చెబితే అవహేళన చేశారు. అవినీతి కేసుల్లో 16నెలలు జైలులో ఉండొచ్చిన జగన్ అవినీతి గురించి మాట్లాడ్డం విచిత్రంగా వుందంటూ తెలుగుదేశం నాయకులు ఎకసెక్కాలకు పోయారు. (మిగతా 11వ పేజీలో)




# అయ్యో... ఆంధ్రాబ్యాంక్

- స్థాపించింది సీతారామయ్య
- భూస్థాపితం చేసింది సీతారామ(న్)నమ్మ

***ఆంధ్రా బ్యాంకు.. 1923లో భోగరాజు పట్టాభి సీతారామయ్య నెలకొల్పిన బ్యాంకు. 2023 సంవత్సరంలో శత వార్షికోత్సవాలకు ముస్తాబవుతుండగా... కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆంధ్రుల మనోభావాలకు ప్రతీకగా నిలిచే ఆంధ్రాబ్యాంకుకు ఆ అవకాశం లేకుండా చేశారు.***

ఇటీవల పలు బ్యాంకులను విలీనం చేయగా, ఆంధ్రాబ్యాంకును యూనియన్ బ్యాంకులో కలపడం జరిగింది. కేంద్రం బ్యాంకులను విలీనం చేశాక కూడా ఇంకా కొన్ని రాష్ట్రాల పేర్లతో బ్యాంకులు నడుస్తుండగా ఆంధ్రాబ్యాంకును మాత్రం లేకుండా చేశారు.

రాష్ట్ర విభజన పేరుతో 2014లో ఆంధ్రులకు అన్యాయం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఇప్పటిదాకా ఏడిపిస్తున్నారు. కనీసం రాష్ట్రం పేరు మీదుగా వున్న ఆంధ్రాబ్యాంకును కూడా ఇప్పుడు లేకుండా చేశారు. కేంద్రంలో ఉన్నోళ్ళకు 'ఆంధ్రా' అంటే చిన్నచూపు ఎక్కువైనట్లుంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన భోగరాజు పట్టాభి సీతారామయ్య ఆంధ్రా బ్యాంకును స్థాపిస్తే, అదే జిల్లాకు కోడలైన నిర్మలాసీతారామన్ ఆ బ్యాంకును భూస్థాపితం చేయాలనుకోవడం విచారకరం.

## విలీనంతో...
# ఆర్టీసీ కార్మికుల్లో ఆనందం




ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అన్నది పెద్ద సాహసం. ఏ ప్రభుత్వం కూడా ఈ సాహసం జోలికి పోలేదు. ఆర్టీసీ కార్మికులు కూడా తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తారని కలలో కూడా ఊహించి వుండరు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే అంశమై రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయడం తెలిసిందే! రెండు నెలల్లోపే ఆంజనేయరెడ్డి తన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ నెల 3న ఆయన నివేదిక అందజేయగా 4వ తేదీ జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆర్టీసీ విలీనానికి ఆమోదముద్ర పడింది. ఆర్టీసీ విలీన వార్త తెలియగానే ఆర్టీసీ కార్మికులు ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. నెల్లూరుజిల్లాలోని పది ఆర్టీసీ డిపోలలో కార్మికులు సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించి తమ కృతజ్ఞత చాటుకున్నారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని....
# అరాచకాలా?
**టిడిపి నేతల ఫైర్**



వైసిపి నాయకులు అధికార గర్వంతో విర్రవీగుతున్నారని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారంటూ ఆ పార్టీ నాయకులు ఫైర్ అయ్యారు. వెంకటాచలం మండలం ఇడిమేపల్లిలో ఓ భూమి కొనుగోలుకు సంబంధించి మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. దీనిపై నిజానిజాలు వివరించేందుకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం వెంకటరమణారెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, డాక్టర్ జడ్.శివప్రసాద్, ధర్మవరం సుబ్బారావు తదితరులు 4వ తేదీ నెల్లూరురూరల్ డిఎస్పీ కె.వి.రాఘవరెడ్డిని కలిశారు. సోమిరెడ్డిపై వున్న కేసుకు సంబంధించిన భూమి పత్రాలను వారు డిఎస్పీకి అందజేశారు.

ఈ సందర్భంగా బీద రవిచంద్ర బయటకొచ్చి విలేకర్లతో మాట్లాడుతూ 1983లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెంకటాచలం మండలం ఇడిమేపల్లిలో 2.41 ఎకరాల భూమిని కొన్నాడని, 2008లో ఆ భూమిని తన సోదరి పేరుతో జిపిఏ ఇవ్వగా, 2017లో దానిని ఆమె విక్రయించారని చెప్పారు. ఆ భూమిలో ఇప్పుడు ఓ పరిశ్రమ కూడా వెలిసిందని అన్నారు. 35ఏళ్ళుగా ఆ భూమిపై ఎలాంటి వివాదాలు లేవని, 1983 నుండి ఇప్పటిదాకా 22ఏళ్ళు తెలుగుదేశం, 15ఏళ్ళు కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్నాయని, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారపక్షంలోనూ, ప్రతిపక్షంలోనూ కొనసాగారని, అప్పుడు లేని వివాదాలను కేవలం రాజకీయ కక్ష కొద్ది ఇప్పుడు సృష్టించి అక్రమ కేసులు బనాయించారని బీద ధ్వజమెత్తారు.

## ప్రపంచ యోగా పోటీలకు జ్యోష్ణవి



ప్రపంచ సీనియర్స్ యోగా పోటీలకు నెల్లూరుకు చెందిన ఏకాంబరం జ్యోష్ణవి భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి అయిన జ్యోష్ణవి ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సత్కరించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఈనెల 6 నుండి 12 వ తేదీ వరకు సౌత్ కొరియాలో జరిగే అంతర్జాతీయ సీనియర్స్ యోగా పోటీల్లో జ్యోష్ణవి పాల్గొననున్నది. దేశ వ్యాప్తంగా జరిగిన ఎంపికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి జ్యోష్ణవిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా యోగా క్రీడాకారులు, క్రీడా ప్రముఖులు హర్షం వెలిబుచ్చారు.

*రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిందే తడవుగా ఇసుక తవ్వకాలపై నిషేధం విధించడం తెలిసిందే! ఇసుకపై కొత్త పాలసీ తీసుకురావాలనుకున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సర్కార్ గత తెలుగుదేశం ప్రభుత్వంలో కొనసాగిన మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో అసలు ఇసుక తవ్వకాలనే ఆపేసింది. దీనివల్ల ఇసుక అక్రమ రవాణా ఆగిపోయింది. అయితే దాంతోపాటే రాష్ట్రంలో నిర్మాణ రంగం కూడా స్థంభించిపోయింది.*



# ఇసుక వెతలు తీరినట్లేనా?

ఒకప్పుడు ఇసుక అంటే పెద్ద లెక్కలోని వస్తువు కాదు. ఇప్పుడు వందల కోట్ల వ్యయం చేసి ఫ్యాక్టరీలు కట్టి ఉత్పత్తి చేసే సిమెంట్ ధరతో పోలిస్తే సగం రేటు పలుకుతోంది. ఇసుకకు అంత డిమాండ్ ఏర్పడిపోయింది. ఇసుక లేకుంటే ఇటుక, సిమెంట్, స్టీలు, పెయింట్స్, గృహ సామాగ్రి... ఇలా ఎన్నో వ్యాపారాలు ఆగిపోయే పరిస్థితి. అంతేకాదు, లక్షల

సింహపురి సమాచారం

సంఖ్యలో వున్న భవన నిర్మాణ కార్మికులకు రోజువారీ పనులు లేకుండాపోయాయి. ఇసుక విధానంలో ఆలస్యం వల్లే జగన్ ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వచ్చిందన్నది కూడా వాస్తవం.

అయితే ముందుగా చెప్పినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 5వ తేదీ నుండి కొత్త ఇసుక పాలసీని అమలులోకి తెచ్చింది. టన్ను ఇసుకను 375 రూపాయలుగా నిర్ణయించింది. అలాగే టన్నుకు కిలోమీటర్‌కు 4.90 రూపాయలు రవాణా ఛార్జీగా నిర్ణయించారు. ఒక ట్రాక్టర్‌కు 5కిలోమీటర్లలోపు వుంటే 450 రూపాయలు ఛార్జీగా నిర్ణయించారు. లోడింగ్‌తో కలిపి టన్నుకు 375 రూపాయలు ధర నిర్ణయించగా రవాణా ఛార్జీలు మాత్రం వేరుగా వుంటాయి. ట్రాక్టర్‌కు 5కిలోమీటర్ల లోపు 450 రూపాయలుగాను, 5 నుండి 10 కిలోమీటర్ల లోపు 650 రూపాయలుగాను, ఆపైన ప్రతి కిలోమీటరుకు 34రూపాయలు అదనంగానూ రవాణా ఛార్జీలుంటాయి. టిప్పర్లకైతే 10కిలోమీటర్ల వరకు 1100 రూపాయలుగాను, ఆపై ప్రతి కిలోమీటర్‌కు 75రూపాయలు అదనంగానూ రవాణా ఛార్జీలు ఖరారు చేశారు.

### అంతా ఆన్‌లైన్‌లోనే...

ఇసుక అమ్మకాలన్నీ ఏపి మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జరుగనున్నాయి. ఇసుక కావాల్సిన వాళ్ళు ప్రభుత్వం ఇందు కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో ఎంత ఇసుక కావాలన్నది బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే దానికి సంబంధించిన నగదు చెల్లించాలి. నగదు చెల్లించి రసీదును దగ్గరలో వున్న డంపింగ్‌యార్డ్‌కు వెళ్లి చూపిస్తే, నేరుగా ఇంటికే ఇసుక వస్తుంది.

### 6 స్టాక్ యార్డ్‌లు..

జిల్లాలో మొత్తం 14 ఇసుక రీచ్‌లు వుండగా రెండింటికి పర్యావరణ అనుమతులు లేకపోవడంతో 12రీచ్‌లలో ఇసుక తవ్వకాలకు నిర్ణయించారు. నెల్లూరు రూరల్‌లోని సజ్జాపురం, గొల్లకందుకూరు, పొట్టేపాలెం(4రీచ్‌లు), బుచ్చి మండలంలోని మినగల్లు, ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాలెం, అనంతసాగరం మండలంలోని లింగంగుంట, పడమటి, కంభంపాడు, విడవలూరు మండలంలోని ముదివర్తి, పొదలకూరు మండలంలోని విరువూరు రీచ్‌ల నుండి ఇసుక తవ్వకాలు జరుగనున్నాయి. వీటికిగాను నెల్లూరు రూరల్‌లోని పొట్టేపాలెం, బుచ్చి మండలంలోని జొన్నవాడ, అనంతసాగరం మండలంలో లింగంగుంట, విడవలూరు మండలంలో ముదివర్తి వద్ద, పొదలకూరు మండలం విరువూరు వద్ద, ఆత్మకూరు మండలం బట్టేపాడు వద్ద ఇసుక స్టాక్ యార్డ్‌లను ఏర్పాటు చేశారు.

ఇసుక నూతన పాలసీ అమలులోకి రావడంతో నిర్మాణ రంగం సమస్యలు తొలగినట్లే! కాకపోతే ఇసుక పక్క రాష్ట్రాలకు అక్రమంగా తరలిపోకుండా చూడాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

## బిట్రగుంట రైల్వే పనులపై...
# సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి

బిట్రగుంట రైల్వే సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై తాను చేసిన సూచనల పట్ల కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సురేష్ అంగడి సానుకూలంగా స్పందించారని నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 1న గూడూరులో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సురేష్ అంగడిని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. బిట్రగుంటలో ఖాళీగా వున్న 1100 ఎకరాల రైల్వే స్థలంలో రైళ్ళ పరిశ్రమను ఏర్పాటు చేయాలని, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు బిట్రగుంటలో స్టాపింగ్ ఇవ్వాలని ఈ వినతిపత్రంలో కోరారు. దీనిపై సురేష్ అంగడి స్పందిస్తూ బిట్రగుంటలో రైలు ఆపే విషయమై ఒక వారంలో నిర్ణయం తీసుకుంటామని, బిట్రగుంటలో ఒక అనువైన పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు త్వరలోనే కార్యాచరణ చేపడుతామని హామీ ఇచ్చారు.

# నెల్లూరులో అన్ని రైళ్ళను ఆపాలి
## వెంకయ్యను కోరిన చలమయ్య



దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు అత్యధిక ఆదాయం సమకూరుస్తున్న నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో అన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లను ఆపేలా చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ ఆర్యవైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య ఓ వినతి పత్రంలో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడును కోరారు. ఈనెల1న ఆయన నెల్లూరులో వెంకయ్యనాయుడును కలిసి రైల్వే సమస్యలపై ఓ వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం షిరిడికి వెళ్లేందుకు వున్న తిరుపతి - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ వారానికి ఒకరోజే నడుస్తుందని, షిరిడికి వెళ్లే భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆ రైలు ప్రతిరోజూ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో నిజాముద్దీన్, గరీబ్‌గఢ్, కోరమాండల్, చప్రా, గంగాకావేరి, తమిళనాడు, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ ఇవ్వాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

# డిఎఫ్ఓగా శ్రీనివాసరెడ్డి

జిల్లా అటవీశాఖాధికారిగా జి.శ్రీనివాసులరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐఎఫ్ఎస్ హోదా కలిగిన శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా వున్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక నెల్లూరుకు డిఎఫ్ఓగా ఆయన రానున్నాడనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జూలైలో ఇక్కడ డిఎఫ్ఓగా వున్న సి.వేణుగోపాల్‌ను విశాఖజిల్లా నర్సీపట్నంకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు కావలి అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా వున్న మంగమ్మను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఎట్టకేలకు ఇప్పుడు పూర్తి స్థాయి డిఎఫ్ఓగా శ్రీనివాసరెడ్డి వస్తున్నారు.



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు పేదప్రజల కోసం అనేక సంక్షేమపథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైసిపి నేతలు కొనియాడారు. ఈ నెల 2వ తేదీన డాక్టర్ వైఎస్సార్ 10వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నాయకులు డాక్టర్ వైఎస్‌ను స్మరించుకుంటూ ఘననివాళులర్పించారు.

# మహనీయుడు... రాజశేఖరుడు!

## - 10వ వర్ధంతి సభలో నేతలు

నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్లో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు అనేక సంక్షేమపథకాలు అందించిన మహోన్నత నేత డాక్టర్ వైఎస్సార్ అని ప్రశంసించారు. మహానేత డాక్టర్ వైఎస్ చూపిన ఆశయాల బాటలో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఆయన ప్రారంభించిన పథకాలు నేడు దేశంలో పలు రాష్ట్రాల ముఖ్య మంత్రులు అనుసరిస్తున్నారని అంటూ డాక్టర్ వైఎస్‌కు నివాళు లర్పించారు. నెల్లూరు కరెంటాఫీస్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ పేదలకు ఆరాధ్యనాయకుడని, ప్రజలంతా సంతోషంగా ఉండాలని, రైతుల కళ్ళల్లో వెలుగు రావాలని తపించేవారని అంటూ డాక్టర్ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ మననుంచి దూరమై పదేళ్ళు గడుస్తున్నా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారన్నారు. వైకాపా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాస్, ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కోవూరు సాయిబాబా గుడి వద్ద జరిగిన వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి డా. అనిల్, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని ఇక్కడ పునఃప్రతిష్ఠించిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి వైఎస్‌కు ఘననివాళులర్పించారు.

ఉదయగిరిలో జరిగిన డా.వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో నెల్లూరు మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని వైఎస్ విగ్రహానికి నివాళు లర్పించారు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, పేదల అభ్యున్నతి కోసం వైఎస్ ఎంతగానో తపించారని అన్నారు.

గూడూరు పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్ విగ్రహానికి గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్ చూపిన ప్రజాసంక్షేమ పాలన ఇప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో అమలవుతోందని ఆయన ఈ సందర్భంగా అన్నారు.



సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన డా.వైఎస్ వర్ధంతి కార్యక్రమాల్లో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని డా.వైఎస్‌కు ఘన నివాళులర్పించారు. వైఎస్ హయాంలో ఎస్‌సిలు ఎంతో అభ్యున్నతి సాధించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, మహానేత డా.వైఎస్ పాలనలో ప్రజల కోసం చేపట్టిన సంక్షేమపథకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు.

సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు. అదేవిధంగా నెల్లూరు మాగుంట లేఅవుట్ లోని వైఎస్సార్‌సిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే కాకాణి పాల్గొని మహానేత వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఇంకా కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోనూ, జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లోనూ ఆయా ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్సీపి నాయకుల ఆధ్వర్యంలో దివంగత మహానేత డా.వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పలుచోట్ల అన్నదానాలు, ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## పురమందిరంలో...
## ఉపాధ్యాయ దినోత్సవం

నెల్లూరులోని సమైఖ్యభారతి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 5న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు ప్రొ. సి.యం.కె.రెడ్డి. వేదికపై శ్రీమతి నందమూరి లక్ష్మీపార్వతి, విఎస్‌యు వైస్‌ఛాన్సలర్ డాక్టర్ సుదర్శనరావు, ఆచార్య ఆదిత్య, ఏ.జయప్రకాష్, తదితరులు.



## మానమాల
# సర్వవిఘ్న నివారణ గణపతికి
# పాతికేళ్ళ సంబరం



సత్కారాన్నందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి - ధనసేన దంపతులు

వినాయకుడంటేనే విఘ్నేశ్వరుడు. చేసే ఏ పనికైనా విఘ్నం కలుగకుండా చూడు స్వామీ అంటూ ఆ మహాగణపతిని వేడుకుంటాం. అలాంటి గణేష్ మహరాజ్‌కి "సర్వవిఘ్న నివారణ గణపతి" పేర పాతికేళ్ళ క్రితం నెల్లూరుజిల్లా, కురుగొండ సమీపంలోని మానమాల గ్రామంలో ఆలయం వెలసింది.

మానమాల గ్రామవాసి మంగలపూరు చంద్రశేఖర్‌రెడ్డి దాతృత్వంతో ఈ మహాగణపతి ఆలయం 1994లో నిర్మించబడింది. అప్పటినుండి చంద్రశేఖర్‌రెడ్డి సారధ్యంలోనే నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వామివారి సేవ కొనసాగుతూ వుంది. అయితే చంద్రశేఖర్‌రెడ్డి తన స్థిర నివాసాన్ని హైదరాబాద్‌కు మార్చుకోవడం, అలాగే ఆలయ ఆలనా పాలనా చూసుకోవడం కష్టతరంగా మారడంతో పాతికేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా తన మిత్రులు, ఆప్తుల సహాయంతో, పదిహేను లక్షల రూపాయల మూలనిధిని ఏర్పాటు చేశారు. ఆ మొత్తాన్ని ఆంధ్రా బ్యాంకులో డిపాజిట్ చేసి, ఆ మొత్తం ద్వారా వచ్చే వడ్డీతో భగవంతుని నిత్యపూజా కార్యక్రమాలు జరిగే టట్లుగా నిర్ణయించారు.

సెప్టెంబర్ 2వ తేదీ "వినాయక చవితి' సందర్భంగా ఆలయంలో పాతికేళ్ళ సంబరాలను జరిపిన చంద్రశేఖర్‌రెడ్డి – ధనసేన దంపతులు రెండురోజుల పాటు గ్రామంలోని ప్రజలందరినీ ఆహ్వానించి వైభవోపేతంగా అభిషేకం, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ "సర్వ విఘ్న గణపతి" ఆలయానికి శాశ్వత నిధిని ఏర్పాటు చేయాలన్న తన పాతికేళ్ళ కల ఇన్నేళ్ళకు నెరవేరిందని, ఈ మహత్కార్యానికి తనకు సహకరించిన దాతల సహకారం మరువలేనిదని అన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి – ధనసేన దంపతులను గ్రామస్తులు సత్కరించి అభినందించారు. ఏ విఘ్నాలు లేకుండా అనుకున్న కార్యక్రమాన్ని పూర్తి చేసిన చంద్రశేఖర్‌రెడ్డి దంపతులకు 'లాయర్' అభినందనలు.

# విపిఆర్ విద్యలో గురుపూజోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఈ నెల 5వ తేదీన నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య మరియు జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విపిఆర్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అక్కడున్న ఉపాధ్యాయులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఒక మంచి ఆశయంతోనే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడానికి రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విపిఆర్ విద్య ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాలను ప్రారంభించారని, ఆయన కలలను నిజం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ నిర్వహించిన క్రీడాపోటీలను ఎంతో ఆసక్తిగా తిలకించి ఉపాధ్యాయులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ వి.టి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# పాక్ యుద్ధకాంక్ష



కాశ్మీర్ విషయంలో ప్రపంచమంతా కూడా భారత్‌వైపు నిలవడం పాకిస్థాన్‌కు ఏ మాత్రం మింగుడుపడడం లేదు. ఓ పక్క ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్‌లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోంది. ఈ వ్యతిరేకత నుండి బయటపడాలంటే భారత్ పట్ల విషం కక్కాలి. విద్వేషం పెంచుకోవాలి. లేదంటే కుర్చీ క్రిందకు నీళ్లొస్తాయి. పాపం అందుకే ఇమ్రాన్‌ఖాన్ భారత్‌తో యుద్ధం తప్పదేమోనంటున్నాడు. ఈ మాటల యుద్ధం చేయడానికి కాదు, కేవలం తన ఆర్మీని చల్లబరచడానికే!

కొంతకాలం స్నేహంతో గుర్రాలు కూడా గాడిదలవుతాయంటారు. ప్రస్తుతం పాకిస్థాన్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ పరిస్థితి అలాగే వుంది. జమ్మూకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత తరచూ ఆయన నోటి నుండి యుద్ధం మాట వస్తోంది. ఆయనే కాదు ఆయన మంత్రులు కూడా భారత్‌తో భీకరమైన యుద్ధం తప్పదంటూ కలవరిస్తున్నారు.

పాకిస్థాన్ ప్రభుత్వంలో మిగతా మంత్రుల విషయాన్ని పక్కనపెడితే ఇమ్రాన్‌ఖాన్ పరిణితి గల వ్యక్తి. ఆయన రాజకీయ నేపథ్యంలో నుండి రాలేదు. మత ఛాందస వాదాల మధ్య పెరగలేదు. ప్రపంచం చుట్టిన మేటి క్రికెట్ క్రీడాకారుడాయన. ఎక్కువ దేశాలలోని ఆటగాళ్ళతో సత్సంబంధాలున్నాయి. అంతెందుకు భారత్‌లోనే తన సమకాలీన క్రికెటర్లతో స్నేహసంబంధాలున్నాయి. ప్రధానిగా ఆయన ప్రమాణస్వీకారానికి ఇండియా నుండి మాజీక్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధు వెళ్లాడంటే ఆయన స్నేహ భావాన్ని అర్ధం చేసుకోవచ్చు. 1992 వరల్డ్‌కప్‌ను ఇమ్రాన్‌ఖాన్ సారధ్యంలోనే పాకిస్థాన్ గెలుచుకుంది. ఈ కప్ ఉపఖండానిదని ప్రకటించడం ద్వారా భారత్ పట్ల సుహృద్భావాన్ని చాటుకున్నాడాయన. ఆనాటి ఇమ్రాన్ ప్రకటనను భారతీయులు సైతం ఎంతగానో అభినందించారు. ఇండియా - పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగిన సందర్భాలలో పాక్ క్రికెటర్ మియాందాద్ భారత్ పట్ల తన విద్వేషాన్ని బయట పెట్టుకున్న సందర్భాలున్నాయి కాని ఇమ్రాన్‌ఖాన్ ఎప్పుడూ అలాంటి పనులు చేయలేదు.

ఇమ్రాన్‌ఖాన్ మంచి నాయకుడే! మంచి ఆలోచనలు వున్నవాడే! కాని నిరంతరం ఛాందసవాదంతో పేట్రేగిపోయే ఉగ్రవాదులున్న పాకిస్థాన్ అన్న దేశమే ఆయన మైండ్ సెట్‌కు సెట్ కావడం లేదు. ఆయన ఆలోచనా విధానానికి తగ్గట్లుగా ఆ దేశం మారడం లేదు. ఆ దేశంలోని అతివాదుల ఆలోచనా ధోరణులకు తగ్గట్లుగా ఇమ్రాన్‌ఖాన్ మారిపోయాడు. అందుకే ఆయన నోట కూడా యుద్ధం అనే మాట వినాల్సి వచ్చింది.

పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం అనేది పెద్ద బూటకం. ఇక్కడ ఎన్నికల వ్యవస్థంతా కూడా పాక్ ఆర్మీ చేతుల్లోనే ఉంటుంది. ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలనేది కూడా ఐఎస్ఐ నిర్ణయిస్తుంది. ప్రధాని ఇక్కడ ఆర్మీ చేతుల్లో కీలుబొమ్మ. ఆర్మీని కాదని సొంత నిర్ణయాలు తీసుకుంటే నవాజ్‌షరీఫ్, బెనజీర్ భుట్టో, ముషారఫ్‌లు ఎన్ని అగచాట్లు పడ్డారో చూశాం. ఇమ్రాన్‌ఖాన్ అందుకు అతీతుడేం కాదు.

పాకిస్థాన్ పాలకులకు భారత విద్వేష వైఖరే ప్రధాన అర్హత. భారత్ మీద ఎంతగా విషం కక్కుతుంటే వారి పదవులు అంత భద్రంగా వుంటాయి. భారత్ పట్ల శత్రువైఖరిని కొనసాగించే పార్టీలకే అక్కడి ప్రజలు మద్దతు పలుకుతుంటారు.

పాకిస్థాన్ ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్ బాధ్యతలు తీసుకున్నాక ఆయనకు అనేక సమస్యలు వచ్చాయి. ముఖ్యంగా ఆయన దురదృష్టం ఏంటంటే భారత ప్రధానిగా నరేంద్ర మోడీ వున్నప్పుడే ఆయన పాకిస్థాన్ ప్రధాని కావడం. ఏ మన్మోహన్‌సింగో ప్రధానిగా వున్నప్పుడు ఆయన పాక్ ప్రధాని అయ్యుంటే... ఆయనకు ఏ సమస్యా వచ్చేది కాదు. ఎందుకంటే మన్మోహన్‌సింగ్ హయాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఎన్ని మారణహోమాలు సృష్టించినా భారత్ వైపు నుండి ప్రతీకార చర్యలు శూన్యంగా వుండిపోయాయి. అదీగాక పట్టుబడ్డ ఉగ్రవాదులను కూడా మనవాళ్ళు జైలులో పెట్టి మదపుటేనుగుల్లా మేపారు.

కాని, ప్రధాని మోడీ హయాంలో అలా కాదు. పఠాన్‌కోట్ మీద దాడి జరిగితే సర్జికల్ స్ట్రైక్‌తో పాక్‌కు షాక్ ఇచ్చారు. పుల్వామా దాడికి ప్రతీకారంగా ఎయిర్‌స్ట్రైక్‌తో గుణపాఠం చెప్పారు. అంతేకాదు, ప్రపంచ వేదికలపై పాకిస్థాన్‌ను ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశంగా నిరూపించడంలో మోడీ విజయం సాధించారు. ఉగ్రవాదం మూలంగా ఇతర దేశాలన్నీ కూడా పాకిస్థాన్‌ను చీదరించుకునే పరిస్థితులొచ్చాయి. ఆఖరుకు మిత్రదేశాలు కూడా పాకిస్థాన్‌కు అండగా నిలవడానికి వెనుకాడుతున్నాయి. ఈలోపు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కూడా అంతంత మాత్రంగా వుంది. బాగా ఇబ్బందుల్లో వుంది. ఈ సమయంలోనే కాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇమ్రాన్‌ఖాన్‌ను మరిన్ని కష్టాల్లోకి నెట్టింది. కాశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా సృష్టించి అగ్రరాజ్యాల వద్ద పంచాయితీ పెట్టాలన్నది పాకిస్థాన్ పన్నిన పన్నాగం. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో పాక్ యజమాని చైనా తప్ప మిగతా దేశాలన్నీ కూడా కాశ్మీర్ భారత అంతర్గత విషయమని తేల్చి చెప్పాయి. ద్వైపాక్షిక చర్చల ద్వారానే ఆ సమస్యను పరిష్కరించుకోవాలంటూ తేటతెల్లం చేశాయి.

కాశ్మీర్ విషయంలో ప్రపంచమంతా కూడా భారత్‌వైపు నిలవడం పాకిస్థాన్‌కు ఏ మాత్రం మింగుడుపడడం లేదు. ఓ పక్క ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్‌లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోంది. ఈ వ్యతిరేకత నుండి బయటపడాలంటే భారత్ పట్ల విషం కక్కాలి. విద్వేషం పెంచుకోవాలి. లేదంటే మొదటికే మోసం వస్తుంది. కుర్చీ క్రిందకు నీళ్లొస్తాయి. పాపం అందుకే ఇమ్రాన్‌ఖాన్ భారత్‌తో యుద్ధం తప్పదేమోనంటున్నాడు. ఈ మాటల యుద్ధం చేయడానికి కాదు, కేవలం తన ఆర్మీని చల్లబరచడానికే!

భారత్ పాక్‌ల మధ్య గతంలో మూడుసార్లు యుద్ధాలు జరిగాయి. ఫలితం ఏంటో అందరికీ తెలుసు. 1965 యుద్ధంలో భారతదేశం గెలిచినా కూడా పాక్ ఆక్రమిత కాశ్మీర్ రూపంలో మన భూమినే కోల్పోయాం. ఆరోజు ప్రధానిగా నెహ్రూ వుండబట్టి ఆ ప్రాంతాన్ని వదులుకున్నాం. కాని, ఇప్పుడు ప్రధానిగా వున్నది నెహ్రూలాంటోడు కాదు, సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ లాంటి మోడీ. ఈసారి పాకిస్థాన్‌తో యుద్ధం అంటూ జరిగితే... నష్టం అన్నది రెండు వైపులా వుండొచ్చు... కాని 1965లో కోల్పోయిన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి చేజిక్కించుకోవడం ఖాయం. కాబట్టి యుద్ధం అన్నది పాక్‌కే పెద్ద అనర్ధం.

## 'రెయిన్‌బో'లో వినాయక చవితి వేడుకలు



నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్ఇ పాఠశాలలో ఈనెల 2న వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణంలో ప్రత్యేకంగా నిర్మించిన హరిత మండపంలో వినాయకుని ప్రతిమను ఉంచి పూలు, ఛత్రాలతో అందంగా అలంకరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి పద్మా సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలనం చేసి ఈ వేడుకలను ప్రారంభిచారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి విద్యార్థి మంచి ఆరోగ్యాన్ని, మంచి విద్యను పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాఠశాల పిల్లలందరూ ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.ప్రతాప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సంగీత కచ్చేరి, నృత్యప్రదర్శనలు అందరినీ అలరించాయి. వైస్ ప్రిన్సిపాల్స్ బద్దెపూడి హరిత, సురేఖారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సౌభాగ్య సరస్వతిదేవికి..

## 9 లక్షలతో వెండికవచం

నెల్లూరు నగరం, పప్పులవీధిలోని గురు దత్తాత్రేయ మఠంలో కొలువై ఉన్న శ్రీ సౌభాగ్య సరస్వతిదేవి అమ్మవారికి భక్తులు 9 లక్షల రూపాయల విలువైన వెండికవచాన్ని బహుకరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి గతనెల 30న ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ఈ వెండికవచాన్ని అలంకరించారు.

వేదపండితులు మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి...

## భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో గతనెల 30న శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శ్రావణ శుక్రవారం పూజలు ఎంతో వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో కుంకుమపూజలు నిర్వహించారు. విశేష అలంకారంతో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. మహిళా భక్తులు సామూహికంగా కుంకుమపూజల్లో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఇ.ఓ శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రత్నం జయరాం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు.




## రాజధాని కోసం రభసెందుకు?

మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి రాజధానిని సింగపూర్, బీజింగ్, టోక్యో, వాషింగ్టన్ చేస్తానని చెప్పి ఐదేళ్ళు గడిపాడు. వేలకోట్లు ఖర్చు చేశాడు. అసలు రాజధానిని ప్రభుత్వం నిర్మించడమేంటి? ప్రభుత్వ అవసరాలకు తగ్గ భవనాలను మాత్రమే ప్రభుత్వం కడితే చాలు. మిగతాదంతా ప్రైవేట్‌గానే అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు రాజధానిని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా చూసుకున్నాడు. కేవలం 175మంది ఎమ్మెల్యేలు, 50మంది ఎమ్మెల్సీలు, కొన్ని వేలమంది అధికారులు, ఉద్యోగులు... వీళ్ళకు కావాల్సిన భవనాలకు ఎన్ని ఎకరాల భూమి కావాలి. 33వేల ఎకరాలు అవసరమా? రాజధానిని ఎక్కడ పెడితే ఏం పోతుంది. హైదరాబాద్ మనదా? మొన్నటి దాకా హైదరాబాద్ పోయి రాలేదా? కేవలం ఆ పరిసర ప్రాంతాలలో తమకున్న భూముల ధరలు ఎక్కడ పడిపోతాయోనన్న భయంతోనే కొందరు రాజధానిపై రచ్చ చేస్తున్నారు.

*గూడలి మీరారెడ్డి, గూడూరు.*

## రోడ్లన్నీ సరిచేయండి

భూగర్భ డ్రైనేజీ పనుల పేరుతో నెల్లూరు నగరంలో అన్ని రోడ్లను తవ్వేశారు. ఎన్నికల ముందువరకు కొన్ని రోడ్లు వేశారు. ఎన్నికల సమయంలో పనులు నిలిపేశారు. ఎన్నికల తర్వాత ఈ రోడ్ల గురించే పట్టించుకోవడం లేదు. అనేక ప్రాంతాలలో సిమెంట్ రోడ్లను మధ్యలో పైపులు వేయడం కోసం కట్ చేసి పెట్టివున్నారు. పనులు జరగక వాటిని సరిచేయలేదు. రాకపోకలకు చాలా ఇబ్బందిగా వుంటోంది. వర్షం పడితే రోడ్లన్నీ బురదమయమవుతున్నాయి. మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు అసంపూర్తిగా వున్న ఈ రోడ్లపై దృష్టిపెట్టాలి.

**కలిచేటి వాసు, నెల్లూరు.**

## జగన్ నిర్ణయం సముచితం

హిందూ దేవస్థానాలలో ఉద్యోగులుగా అన్యమతస్థులు ఉండకూడదన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతైనా సముచితం. స్వాగతించదగినది. హిందూ దేవాలయాలలో పని చేసే వాళ్ళు కేవలం జీతాలకే కాదు, దైవం పట్ల చిత్తశుద్ధి, భక్తి విశ్వాసాలు కలిగివుండాలి. కాని, దురదృష్టవశాత్తు కొందరు రిజర్వేషన్‌ల ద్వారా దేవాలయాలలో ఉద్యోగాలు సంపాదించి, అక్కడి సొమ్ము తింటూ అన్యమత ప్రచారాలకు పాల్పడుతున్నారు. తిరుమల దేవస్థానంలోనే ఇలాంటివి ఎన్నో బయటపడ్డాయి. ఒక్క తిరుమలలోనే కాదు, భారతదేశంలో ఏ హిందూ పుణ్యక్షేత్రంలో కూడా అన్యమతస్థులు ఉద్యోగులుగా వున్నా వారిని ఇతర ప్రభుత్వ రంగాలకు బదిలీ చేయాలి. హిందూ దేవాలయాలలో అన్యమత ప్రచారం జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**



రైల్వే టన్నల్‌ను ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు దంపతులు

## జన్మభూమి సేవలో..

# మురిసిన వెంకయ్య!

### దేశంలోనే అత్యంత పొడవైన రైల్వే సొరంగ మార్గం, గూడూరు - విజయవాడల మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

***కన్నతల్లి, మాతృభాష, జన్మభూమి గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పే భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు తన మాటలను ప్రసంగాల్లోనే కాదు ఆచరణ లోనూ చూపుతుంటారు. 130 కోట్ల భారతావనికి రెండో పౌరుడి హోదాలో వున్నప్పటికీ తన సొంత జిల్లా నెల్లూరుకు విచ్చేస్తే మాత్రం నెల్లూరీయుడైపోతారు. ఇక్కడి తన ఆత్మీయులలో ఒకడిగా కలిసిపోతారు.***

ఉపరాష్ట్రపతిగా రెండేళ్ళ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న వెంకయ్య ఈ ఆనంద క్షణాలను తన నెల్లూరీయులతో పంచుకోవాలని నాలుగురోజుల పాటు నెల్లూరులో పర్యటన పెట్టుకున్నారు. ఆగస్టు 31వ తేదీ నెల్లూరుకు వచ్చిన వెంకయ్య ఆరోజు మధ్యాహ్నం నుండి కృష్ణపట్నం – ఓబులవారిపల్లెల మధ్య కొత్తగా నిర్మించిన రైల్వేలైన్‌ను పరిశీలించారు. వెంకటాచలం నుండి ప్రత్యేకరైలులో రాపూరు మండలం చెర్లోపల్లి వరకు వెళ్లారు. దేశంలోనే అత్యంత పొడవైన రైల్వే సొరంగ మార్గాన్ని ఆయన పరిశీలించి ఆనందపరవశులయ్యారు. ఈ రైల్వే మార్గాన్ని తన చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో స్వర్గీయ మాజీప్రధాని వాజ్‌పేయి హయాంలో పురుడుపోసుకున్న ఈ రైల్వే మార్గాన్ని ప్రధానిగా నరేంద్ర మోడీ హయాంలో ప్రారంభించుకోవడం ఆనందం కలిగిస్తోందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని, ఈ రైల్వే మార్గంలో కృష్ణపట్నం పోర్టు నుండి ఇతర ప్రాంతాలకు ప్రయాణదూరం తగ్గడంతో పాటు సరుకుల రవాణా పెరుగుతుందని చెప్పారు.



జెండా ఊపి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఈ జిల్లా రైలు ప్రయాణీకులకు అందించిన అపూర్వ కానుక గూడూరు – విజయవాడల మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్. వెంకయ్య కోరిక మేరకు రైల్వేమంత్రి పీయుష్ గోయల్ ఈ రైలును మంజూరు చేయగా, ఆ రైలును ఈ నెల 1వ తేదీన వెంకయ్య గూడూరు రైల్వేస్టేషన్‌లో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అలాగే కొత్తగా నిర్మించిన 4, 5 ప్లాట్‌ఫారంలను, 2వ పాదచారుల వంతెనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుమారు 400 అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని, ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా నకిలీ లబ్దిదారులను తొలగించి పథకాలన్నీ అర్హులకే అందేలా చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో వంద స్మార్ట్‌సిటీలను, 10 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులను, 5 మేజర్ సీ పోర్టులను ఏర్పాటు చేస్తోందన్నారు. త్వరలో నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్‌ను కూడా పూర్తి చేయడం జరుగుతుందని, దీని ద్వారా మెట్ట ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సురేష్ అంగడి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# బయటకొచ్చిన వాకాటి



బ్యాంకులను మోసం చేసిన కేసులో దాదాపు ఒకటిన్నర ఏడాదికిపైగా కర్నాటకలోని పరప్పన అగ్రహార జైలులో రిమాండ్ ఖైదీగా వుంటున్న ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికి ఎట్టకేలకు బెయిల్ లభించింది. బెయిల్‌పై విడుదలయ్యాక ఆయన తన స్వగ్రామమైన తడ మండలంలోని చేనిగుంటకు చేరుకున్నాడు. జిల్లాలోని పలువురు ఆయన సన్నిహితులు చేనిగుంటకు వెళ్లి పరామర్శిస్తున్నారు. బ్యాంకు బకాయి కేసులో 2018 జనవరిలో సిబిఐ ఆయనను అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టింది. కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో బెంగుళూరులోని పరప్పన అగ్రహారం జైలులో రిమాండ్ ఖైదీగా వుంటున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా కర్నాటక హైకోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత ఆయన బెయిల్ కోసం సుప్రీం కోర్టు కెళ్లాడు. సుప్రీం కోర్టు కరుణించి బెయిల్ ఇవ్వడంతో దాదాపు 20నెలల తర్వాత బయటకొచ్చాడు. వాకాటి జైలుకు వెళ్లక ముందు నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి సభ్యుడిగా గెలిచాడు. అప్పట్లో ఆయన తెలుగుదేశంలో వున్నాడు. ఎమ్మెల్సీగా గెలిచిన కొన్ని నెలలకే ఆయనను సిబిఐ అరెస్ట్ చేయడంతో ఇలాంటి అవినీతి పరులకు నా పార్టీలో స్థానం లేదన్నట్లుగా చంద్రబాబునాయుడు ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. ఆయన జైలులో వుండగానే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఆయన అనుచరులు వైసిపిలో చేరారు. ఇటీవల ఆయన ఆప్తమిత్రుడు ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి చనిపోగా ఆయన చివరి చూపుకు కూడా నోచుకోలేకపోయాడు.

## ఆ లైన్ కూడా పూర్తయితే...

# జిల్లా అంతటా రైల్వే మార్గం




కాశ్మీర్ టు కన్యాకుమారి... దేశంలోనే అతి పొడవైన రైల్వేలైన్ నెల్లూరు మీదుగానే వెళుతుంది. దేశంలోని మహా నగరాలను కనెక్ట్ చేస్తుంది. చెన్నై – విజయవాడ మార్గంలో బ్రిటీష్ వారి హయాంలోనే రూపుదిద్దుకున్న ఈ రైల్వేలైన్ జిల్లాలో కావలి నుండి తడ వరకు వున్న ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. ఇక గూడూరు జంక్షన్ నుండి తిరుపతి రైల్వేలైన్ వెంకటగిరి ప్రాంతాన్ని కూడా కవర్ చేస్తుండడం తెలిసిందే!

అయితే జిల్లాలో కొత్తగా వచ్చిన మరో రెండు లైన్లతో జిల్లాలోని దాదాపు అన్ని మండలాలకు కూడా రైల్వే ప్రయాణ వసతి, సరుకు రవాణా వసతి సమకూరబోతుంది. కృష్ణపట్నం – ఓబులవారిపల్లెల మధ్య పూర్తయిన రైలు మార్గాన్ని భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ప్రజలకు అంకితం చేయడం జరిగింది. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్ళు తిరుగుతున్నాయి. డిసెంబర్ నెలలో ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను ప్రవేశ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ లైన్ వల్ల సర్వేపల్లి, వెంకటాచలం, రాపూరు, పొదలకూరు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం పెరగనుంది.

ఇక శ్రీకాళహస్తి – నడికుడి రైల్వే పనులు కూడా వేగవంతంగానే జరుగుతున్నాయి. ఈ రైల్వేలైన్ కూడా పూర్తయితే ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి, రాపూరు ప్రాంతాల ప్రజలకు రైల్వే ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లే! ఈ లైన్ పూర్తయితే జిల్లాలో నాలుగు రైల్వే మార్గాలున్నట్లవుతుంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ప్రభుత్వ మద్యం దుకాణాలు వచ్చేశాయ్..

**ఉదయం 10గంటల నుండి రాత్రి 9 గంటల వరకు**



నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ జిల్లాల పరిధిలో 51 ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. గత నెల 31 న అధికారులు నెల్లూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలోని దుకాణాలకు దేవరపాళెం, గూడూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలోని వాటికి ఓజిలి లోని మద్యం డిపో నుంచి మద్యాన్ని తరలించారు. ఈనెల 1న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని దుకాణాలను ప్రారంభించారు. 50 దుకాణాలు ఈనెల1 న ప్రారంభం కాగా ఒకటి పలు కారణాల వల్ల వాయిదా పడింది. ఉదయం 10 గంటల నుండి రాత్రి 9గంటల వరకు విక్రయాలు సాగుతున్నాయి. ప్రభుత్వ దుకాణాల వద్ద మద్యం సేవనం, లూజు విక్రయాలను నిషేధించింది. ప్రభుత్వ నిబంధనల మేరకే దుకాణాల్లో విక్రయాలు సాగుతాయని నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ డాక్టర్ వి.రాధయ్య తెలిపారు. ఎమ్మార్పీ రేటుకే విక్రయాలు జరపాలన్నారు. దుకాణాల బయట ఎట్టి పరిస్థితిలో తాగేందుకు అనుమతించరాదన్నారు. షాపు ఎదుట ఎమ్మార్పీ బోర్డు ఏర్పాటు, విక్రయ వివరాలను ఆయా ప్రాంత ఎక్సైజ్ అధికారులకు ప్రతిరోజూ తెలియజేయాలన్నారు. కొత్త పాలసీ ప్రకారం జిల్లా అంతటా అక్టోబర్1 నుంచి 280 ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్కో దుకాణానికి ఒక్కో కానిస్టేబుల్‌ను, ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్‌ను నియమించామన్నారు.



## నెల్లూరు కబుర్లు

### ప్రభుత్వ నిర్ణయాన్ని
## పొగిడిన సురేంద్రరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పి.సురేంద్రరెడ్డి

హిందూ ఆలయాలు, ధార్మిక కేంద్రాలలో అన్య మతస్తులు ఉద్యోగులుగా ఉండకూడదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి అభినందించారు. ఇటీవల నెల్లూరులో విలేకరులతో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం టిటిడి ఇ.ఓగా పనిచేసినప్పుడు ఎంతోమంది అన్యమతస్తులను తిరుమల నుండి పంపించారని, హిందూధర్మ వ్యవస్థలపై ఎంతో గౌరవం వున్న ఆయన ఇప్పుడు సిఎస్‌గా వుండి మరోసారి తిరుమల పవిత్రతను కాపాడడానికి చర్యలు తీసుకోవడం శుభపరిణామమన్నారు.

### నెల్లూరులో..
## ఓటర్ల సహాయ కేంద్రాలు

నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలోని మూడవ అంతస్థులో అలాగే మూలాపేటలోని ఏసుగు సుందరరామిరెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో ఎన్నికల విభాగం అధికారులు నగరపాలక సంస్థకు సంబంధించిన ఓటర్ల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్టోబర్ 15వ తేదీ వరకు ఈ కేంద్రాలలో ఓటర్లు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు. మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. 18ఏళ్ల నిండిన వాళ్ళు ఓటు నమోదు చేసుకోవచ్చు.

### భాస్కరరావుకు
## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు




రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునందుకుంటున్న భాస్కరరావు

నెల్లూరు నగరం కొండాయపాళెం దళితవాడ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేకల భాస్కరరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానోత్సవంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలాచారి, రుద్రరాజు పద్మరాజు, దైవజ్ఞశర్మ తదితరుల చేతుల మీదుగా శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరులోని కొండాయపాళెం పాఠశాల ఉపాధ్యాయులు, అభిమానులు, శ్రేయోభిలాషులు భాస్కరరావును అభినందించారు.

### 'ఇంటింటి సర్వే'కి...
## అందరూ సహకరించాలి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి సర్వేను నూతనంగా నియమితులైన వలంటీర్లు నిర్వహిస్తున్నారని, వీరికి ఆయా కుటుంబాల వారు వివరాలను అందించి సహకరించాలని కార్పొరేషన్, వార్డు వలంటీరు, వార్డు సచివాలయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసులు కోరారు. నగరంలోని 31 వ డివిజన్‌లో ఇటీవల వలంటీర్లు చేస్తున్న సర్వేలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డు, పింఛన్లు, వివిధ పథకాలకు సంబంధించి ఈ సర్వే జరుగుతోందని తెలిపారు.

## పవన్ జన్మదినోత్సవం



చిన్నారి చేత పవన్ బర్త్‌డే కేక్‌ను కట్ చేయిస్తున్న అభిమానులు

జనసేన క్రమశిక్షణ కమిటీ సభ్యులు మనుక్రాంత్ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను 2వ తేదీ నెల్లూరురూరల్ ఆఫీసు వద్ద ఘనంగా నిర్వహించారు. పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించి, కేక్ కట్ చేశారు. అందరికీ స్వీట్లు పంచారు. ఈ వేడుకలలో పసుమర్తి కిషోర్, గునుకుల కిషోర్, అంకిత్, మొయినుద్దీన్, కృష్ణారెడ్డి, సావిత్రి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారులకు అవార్డులు

అడవుల సంరక్షణలో ఉత్తమ సేవలు అందించినందుకుగాను జిల్లా అటవీశాఖకు చెందిన 7గురు అధికారులకు రాష్ట్రస్థాయి అవార్డులు అందాయి. జిల్లా ఇన్‌ఛార్జ్ అటవీశాఖ అధికారి మంగమ్మ, వెంకటగిరి రేంజ్ ఎఫ్‌బిఓలు అశోక్, సలీం, నెల్లూరు రేంజ్ ఎఫ్‌బిఓలు సంపత్, శ్రీరాములు, నెల్లూరు రేంజర్ మారుతీప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్‌బాబులు అవార్డులు అందుకున్నారు.

### ఏపీ హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా
## సతీష్‌కుమార్

నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది యస్. సతీష్‌కుమార్‌ను ఏపీ హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ళపాటు ఆయన విధులు నిర్వర్తించనున్నారు. సతీష్‌కుమార్ నియామకంపై నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

### గొలగమూడికి
## జయరామిరెడ్డి పాదయాత్ర

వైయస్సార్ సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా అనిల్ కుమార్‌యాదవ్ గెలుపొందాలనే మొక్కు నెరవేరడంతో ఆ పార్టీ నాయకుడు సగిలి జయరామిరెడ్డి గతనెల 31న నెల్లూరు నుండి గొలగమూడి వెంకయ్యస్వామి గుడి వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్ కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. చిల్డ్రన్స్ పార్కు వద్దగల వినాయక గుడి వద్దనుండి 100మంది పార్టీ కార్యకర్తలతో గొలగమూడి ఆశ్రమం వరకు పాదయాత్ర చేశారు. బి.భాస్కరరెడ్డి, ఓ.నాగేశ్వరరావు, సురేందర్ రెడ్డి, జి.వెంకటేశ్వర్లరెడ్డి, సురేష్, నరేంద్ర పాల్గొన్నారు.

## వాడుకలోకి పాత మున్సిపల్ ఆఫీసు



నెల్లూరు నగరం సంతపేట, పాత పెద్దాసుపత్రిరోడ్డులో వున్న పాత మున్సిపల్ కార్యాలయాన్ని మళ్ళీ వాడుకలోకి తీసుకురావడానికి నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాత మున్సిపల్ భవనంలో కొన్ని విభాగాలను ఏర్పాటు చేసి దీనిని వాడుకోవాలనుకుంటున్నారు. ఈమేరకు ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి ఈ భవనాలను పరిశీలించడం జరిగింది. దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో మున్సిపాలిటీగా వున్న నెల్లూరును కార్పొరేషన్‌గా మార్చడమే కాక, పొదలకూరురోడ్డులోని క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో నూతన కార్పొరేషన్ భవనానికి ఆయన నిధులు మంజూరు చేయడం, మాజీఎమ్మెల్యే స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి సూచనలతో కొత్త భవనం రూపుదిద్దుకోవడం తెలిసిందే! ఈ భవనానికి వైయస్ పేరే పెట్టారు కూడా! కొత్త భవనంలోకి కార్పొరేషన్ కార్యాలయాన్ని మార్చాక పాత భవనాన్ని పూర్తిగా వదిలేశారు. అది బూత్‌బంగ్లా మాదిరిగా తయారైవుంది. ఓపక్క ఇలాంటి భవనాలను ఉపయోగించుకోకుండా 'నుడా' ఆఫీసుకు అద్దె భవనాలను తీసుకోవడం చూస్తున్నాం. ఎట్టకేలకు ఈ పాత భవనాలను మళ్ళీ వాడుకోవాలనే ఆలోచన అధికారులకు కలగడం మంచి పరిణామమే!

## ముసవ్వీర్ మరో అద్భుతం

**బంగారంతో 11 రకాల సూక్ష్మ వినాయకులు**





షేక్ ముసవ్వీర్

నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డాక్టర్ షేక్ ముసవ్వీర్ గతంలో వెండి బంగారంతో అనేక సూక్ష్మ నమూనాలను తయారుచేసి అందరి ప్రశంసలందుకున్న విషయం విధితమే. ఈసారి వినాయకచవితి పర్వదినం సందర్భంగా 11 రకాల వినాయక ప్రతిమలను 50 మిల్లీ గ్రాముల నుండి 800 మిల్లీ గ్రాముల బంగారంతో సూక్ష్మ నమూనాలను తయారుచేసి అందరిని ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ముసవ్వీర్ మాట్లాడుతూ బంగారు సూక్ష్మ నమూనాలో మొత్తం 2,340 మిల్లీ గ్రాములతో తయారుచేశానని, ఇందులో ప్రముఖంగా300 మిల్లీ గ్రాములతో తయారుచేసిన త్రిముఖ వినాయక విగ్రహం అందరిని ఆకట్టుకుందని తెలిపారు. దీనిని తయారుచేయడానికి 10 రోజుల సమయం పట్టిందని, ఎత్తు 0.5 సెం.మీలు నుండి 3 సెం.మీ వరకు ఉందని తెలిపారు.

### చిల్లగింజలతో..
## చిన్ని గణపతి



చిల్లగింజలతో వినాయకుడిని మలుస్తున్న చంద్ర

నెల్లూరు పొగతోటకు చెందిన స్కూటర్ మెకానిక్, సూక్ష్మ కళాకారుడు తిరుమలశెట్టి చంద్ర వినాయక చవితి సందర్భంగా చిల్ల గింజలతో చిన్ని గణపతిని రూపొందించారు. పర్యావరణ పరిరక్షణ నేపధ్యంలో ఈ విగ్రహాన్ని దాదాపు మూడు వారాలు కష్టపడి తయారుచేశాడు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ పేపరు, పత్తి, చిల్ల గింజలు, మూలికా చూర్ణం, కస్తూరి పసుపు తదితరాలు శుభ్రపరిచిన నీటితో దీనిని తయారు చేసినట్లు తెలిపారు. ఈ లేపనం చర్మ, కీళ్ల సంబంధిత, మధుమేహం, మూత్ర పిండాల వ్యాధులను తగ్గిస్తుందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ గణపతిని రూపొందించినట్లు తెలిపారు.

### డా.కిషోర్స్ రత్నం విద్యార్థులకు..
## విలువిద్యలో బంగారు పతకాలు



పతక విజేతలను అభినందిస్తున్న జిఎం రామ్మూర్తినాయుడు

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీల్లో డాక్టర్ కిషోర్స్ రత్నం మెడికల్ ఒలింపియాడ్, మరియు టెక్నో విద్యార్థులు పసిడి పతకాలు, రజత పతకాలు సాధించారు. బాలికల విభాగంలో 8వ తరగతికి చెందిన గేయదీపిక, 6వ తరగతికి చెందిన నిఖిల బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా, బాలుర విభాగంలో 6వ తరగతి విద్యార్థి జ్వాలా ధనరాజ్, 7వ తరగతి విద్యార్థి దినేష్‌లు రజత పతకాలు కైవశం చేసుకున్నారు. విజేతలైన ఈ విద్యార్థులు డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు నిర్వహిస్తున్న యాక్టివిటీ టైమ్‌జోన్ కోచ్ విజయ భరద్వాజ్ మరియు చాముండేశ్వరి ఆధ్వర్యంలో తర్ఫీదు పొందారని స్కూల్ నిర్వాహకులు తెలిపారు. పతకాలను సాధించిన విద్యార్థులను డా.కిషోర్స్ రత్నం పాఠశాల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, మేనేజర్ జితేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 10ఏ నావల్ యూనిట్‌కు
## స్వర్ణ పతకాలు



ఎన్ సీసీ ఇంటర్ గ్రూప్ చాంపియన్‌షిప్ పోటీల్లో 10ఏ నావెల్ యూనిట్ 5 స్వర్ణాలు, 8 రజత పతకాలను సాధించిందని కమాండర్ యుగంధర్‌రెడ్డి తెలిపారు. గతనెలలో ఎన్‌సీసీ ద్వారా విశాఖపట్నంలో నిర్వ హించిన రాత పరీక్ష, బోట్ పుల్లింగ్, ఫైరింగ్, బోట్ రిగ్గింగ్, డ్రిల్, షిప్ మోడలింగ్, హైజీన్ తదితర అంశాల్లో ప్రతిభ చూపారని తెలిపారు. నేవీ సంబంధిత షిప్ యూనిట్‌కు శిక్షణ కోసం బోట్ జెట్టీ, ఫైరింగ్ రేంజ్, మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



నూతన కమిటీ ఛైర్మెన్ అబ్దుల్ రజాక్ ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

# రొట్టెల పండుగ బాగా జరుపుకుందాం

మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ నిర్వహణ కోసం 25మంది సభ్యులతో కమిటీ వేశారు. ఈ కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 3వతేదీ బారాషహీద్ దర్గా ఆవరణలో జరిగింది. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, వైసిపి నెల్లూరు రూరల్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు పి.రూప్‌కుమార్, షమి, తాటి వెంకటేశ్వర్లు, ముక్కాల ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు. కమిటి ఛైర్మెన్‌గా అబ్దుల్ రజాక్ ప్రమాణం చేశారు. ఈనెల 10 నుండి జరిగే రొట్టెల పండుగను సమైక్యంగా, సామరస్యంగా, విజయవంతంగా జరుపుకుందామని నాయకులు పిలుపునిచ్చారు.

# శ్రీసిటీలో ఎమ్మెల్యే సంజీవయ్య

నెల్లూరు జిల్లా తడ మండలంలోని శ్రీసిటీని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇటీవల సందర్శించారు. ఎమ్మెల్యేగా రెండవ సారి గెలుపొందిన తర్వాత మొదటి సారిగా ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటి ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను స్వాగతిస్తున్న శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీసిటీ ఏర్పాటు అనంతరం సూళ్లూరుపేటకు నూతన కళ వచ్చిందన్నారు. చెన్నై నుంచి గుమ్మిడిపూండి వరకు వస్తున్న అన్ని లోకల్ రైళ్లను సూళ్లూరుపేట వరకు పొడిగించాల్సిన అవసరం వుందన్నారు. అలాగే విజయవాడ-గూడూరు మధ్య నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను సూళ్ళూరుపేట వరకు పొడిగించేలా కృషి చేద్దామన్నారు. సూళ్ళూరుపేట అభివృద్ధికి కావలసిన సహాయ సహకారాలను తమ ద్వారా అందించాలని శ్రీసిటీ ఎండీని కోరారు. జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేసేందుకు, సరైన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చేయూతనివ్వాలని కోరారు. వీటిపై స్పందించిన శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి సమిష్టిగా కృషి చేద్దామని, అభివృద్ధిలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీఇచ్చారు.

# ఒకే దేశం... ఒకే జెండా... ఒకే ఎజెండా!

## నెల్లూరులో ఆర్టికల్ 370 రద్దు విజయోత్సవ సభ




ఆర్టికల్ 370 విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి

దేశంలో ఒకే జెండా, ఒకే చట్టం ఉండాలన్నదే భారతీయ జనతాపార్టీ అభిమతమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీన బీజేపీ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని సింహపురి హాస్పిటల్ జంక్షన్ నుండి మినీబైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్ వద్దనున్న పివిఆర్ కళ్యాణ మండపం వరకు ఆర్టికల్ 370 విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివిఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న సంచలన నిర్ణయం దేశ సుస్థిరతకు, సమైక్యతకు బాటలు వేస్తుందన్నారు. ఆర్టికల్ 370 రద్దు ద్వారా బీజేపీ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయం నెరవేరిందన్నారు. ఆర్టికల్ 370 వల్లే భారతదేశంలో ఉగ్రవాదం పెరిగిందని, మాజీప్రధాని స్వర్గీయ నెహ్రూ నిర్వాకం వల్లే ఈ దేశం ఉగ్రవాదానికి ఎంతో మూల్యం చెల్లించుకుందన్నారు. కాశ్మీర్ కోసమే పాకిస్థాన్‌తో ఇప్పటికి మూడుసార్లు యుద్ధం చేశామని, అవసరమైతే ఇంకోసారి యుద్ధానికైనా సిద్ధమేనన్నారు. కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌ను ఏకాకిని చేసి భారత్‌కు అన్ని దేశాల మద్దతు కూడగట్టడంలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన కృషి అనిర్వచనీయమైందన్నారు.

ఈ సభలో బీజేపీ నాయకులు సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, కందుకూరి సత్యనారాయణ, పసుపులేటి సుధాకర్, ఎం.ఈశ్వరయ్య, భానుప్రకాశ్‌రెడ్డి, డేవిడ్ విల్సన్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం

## - గుంటూరు రేంజ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్



మోటార్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల విశ్రాంతి గదులను ప్రారంభిస్తున్న ఐ.జి వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్పీ రస్తోగి

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పూర్తి చర్యలు తీసుకుంటామని గుంటూరు రేంజ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కొత్తగా నిర్మించిన మోడరన్ ట్రాన్స్‌పోర్ట్(ఎంటీ) డ్రైవర్ల విశ్రాంతి గదులు, వాహన పార్కింగ్ షెడ్‌ను గతనెల 31న ఐజీ ప్రారంభించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వాహన పార్కింగ్‌షెడ్ సమీపంలో ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పని చేస్తున్న డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు సరైన సదుపాయాలు లేవన్నారు. రూ.10 లక్షల వ్యయంతో 10 పడకలతో విశ్రాంతి గదిని, 9 హెవీ, 16 లైట్ వెహికల్స్ పార్కు చేసేందుకు వీలుగా షెడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, డీఎస్పీలు ఎన్. కోటారెడ్డి, జే.శ్రీనివాసులురెడ్డి, కేవీ రాఘవరెడ్డి, మల్లిఖార్జున, లక్ష్మీ నారాయణ, రవీంద్రరెడ్డి, సీఐలు పి.శ్రీనివాసులురెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, ఎం.నాగేశ్వరమ్మ, ఆంజనేయరెడ్డి, ఆర్ ఐలు చంద్రమోహన్, రమేష్ కృష్ణన్, మౌలాలుద్దీన్, ఎంటీఓ గోపీనాథ్ పాల్గొన్నారు.




జక్కా హర్షవర్ధన్‌రెడ్డి

జననం: 04.10.1957 మరణం: 07.09.1997

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్యాపో నశోషయతి మారుత: ॥ (గీత)

సంస్మరణ

మా అందరిలో ఒకడిగా, మాకందరికీ తోడుగా
నీవు లేని ఈ లోకం, రూపుదాల్చిన శోకం!
మా గుండెల్లో గుడి కట్టి పదిలంగా నిలిచావు.
మా హృదయాల్లో కలకాలం జీవించే ఉంటావు!!

నీ స్మృతిలో..

స్వప్న - భార్య

జె.వి.రెడ్డి - తండ్రి
జానకి - తల్లి

కుమార్తెలు - అల్లుడు
సంజన - కుషాన్
సుస్మిత

చెల్లెలు - బావ
శరణ్య - డా॥ అశోక్

మేనల్లుడు - మేనకోడలు
అశ్విన్ - షీనా

మరియు
కుటుంబసభ్యులు

# కల్యాణ వైభవం...!

శ్రావ్య కీర్తన - సంజయ్



గూడూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ - నిర్మలల కుమార్తె డాక్టర్ శ్రావ్య కీర్తన - సంజయ్ (చెన్నై వాస్తవ్యులు ఎస్.మునియాండి-ఉమల కుమారుడు)ల వివాహం ఆగస్టు 26వతేదీ గోవాలోని మెతోడిస్ట్ చర్చ్ నందు వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# వెంకటగిరిని ప్రగతిపథంలో నడిపిస్తా..

## ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం, మాజీఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో వెంకటగిరి నియోజకవర్గాన్ని ప్రగతి వైపు నడిపిస్తానని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డి అన్నారు. గత నెల 31న వెంకటగిరిలో గ్రామ శక్తి పోలేరమ్మ తల్లి జాతర నిర్వహణపై రాజా కుటుంబీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్రతో చర్చించారు. తొలుత విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లు పర్యవేక్షణ దళం కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ వెంకటగిరి గోషా ఆసుపత్రి పునఃప్రారంభం, బాలాయపల్లి మండలం జయంపు, సైదాపురం, రాపూరు మండలాల్లో అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కండలేరు వద్ద దివంగత సీఎం వైయస్సార్ హయాంలో ప్రారంభించిన మోడల్ స్కూల్ ప్రస్తుతం మూతపడిందని, ఆ భవనాల్లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసేందుకు వ్యవసాయశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్ళగా సానుకూలంగా స్పందించారన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన అవసరం ఉన్న ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియో జకవర్గంలోని అన్ని మండలాలతో పాటు వెంకటగిరి మునిసిపాలిటీకి తాగునీటి అవసరాల కోసం రూ. 1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తెలుగుగంగ కాలువ ద్వారా అన్ని చెరువులకు సాగునీరు అందిస్తామన్నారు. వైయస్సార్ సీపీ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దొంతు శారద తదితరులు పాల్గొన్నారు.

### పోలేరమ్మ జాతరను రాజాలు ముందుండి జరిపించాలి...

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన వెంకటగిరి పోలేరమ్మ జాతరను వెంకటగిరి రాజాలు ముందుండి జరిపించాలని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 1న వెంకటగిరి రాజా ప్యాలెస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోలేరమ్మ జాతరలో సంప్రదాయాలు, ఆనవాయితీలు, ఆచార వ్యవహారాలను శతాబ్దాల కాలంగా వెంకటగిరి రాజవంశీయులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ ఏడాది అమ్మవారి జాతరను సాయికృష్ణ యాచేంద్ర క్రియాశీలకంగా వ్యవహరించి ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, ఆయనకు అండగా తాను, వెంకటగిరి గ్రామపెద్దలు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా వెంకటగిరి పోలేరమ్మ జాతర నిర్వహణను రాజాలు విజయవంతం చేసి అమ్మవారి ఆశీస్సులను వెంకటగిరి ప్రాంత ప్రజలపై ఉండేలా చూడాలన్నారు. రాజా కుటుంబీకుడు వీబీ సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరి జాతర ఏ ఒక్కరిది కాదని, వెంకటగిరీయులందరిదీ అని అన్నారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో ఈ ఏడాది జరిగే పోలేరమ్మ జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సర్వజ్ఞ కుమార యాచేంద్ర, కె. ధనుంజయరెడ్డి, పట్టణ కన్వీనర్ జి. ఢిల్లీబాబు, చేనేత విభాగం అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నెమళ్ళపూడి సురేష్‌రెడ్డి, చెలికం శంకరరెడ్డి, ఎ. గిరియాదవ్, దొంతు బాలకృష్ణ, తోట గిరిరెడ్డి, కె. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక సిపిఓగా రాజగోపాల్

జిల్లా ప్రణాళికాధికారిగా వి.రాజగోపాల్ ఈ నెల 1న తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రణాళికాధికారిగా వున్న ఎం.డి రజాక్ 31వ తేదీ పదవీ విరమణ చేశారు. దీంతో జిల్లా ప్రణాళి కాధికారి కార్యాలయంలో డిప్యూటి డైరెక్టర్‌గా వున్న రాజగోపాల్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో తాత్కాలిక సిపిఓగా నియమించారు.



# గూడూరు డివిజన్ వార్తలు

# పేదల పెన్నిధి రాజన్న

## - ఎమ్మెల్యే వి.వరప్రసాదరావు



పేదల కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు దివంగత నేత మాజీముఖ్యమంత్రి వై. యస్. రాజశేఖర రెడ్డి అని గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాదరావు పేర్కొన్నాడు. ఈ నెల 2వ తేదీన డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని గూడూరు పట్టణం బనిగిసాహెబ్‌పేటలో వున్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో పేదప్రజలు అనుభవించే సంక్షేమ కార్యక్రమాలన్నీ కూడా రాజశేఖరరెడ్డి అమలులోకి తెచ్చినవేనన్నారు. ఈరోజు రాజన్న మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలకు వారసులుగా వై. యస్. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం రాష్ట్ర ప్రజల అదృష్టమని, జగన్ రాకతో ప్రజలకు మళ్ళీ మంచిరోజులొచ్చాయని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని ప్రజాసంక్షేమ హామీలను ఆచరణలోకి తేవడం ద్వారా తండ్రికి తగ్గ తనయుడిగా జగన్మోహన్‌రెడ్డి నిరూపించుకుంటున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా గూడూరు ఏరియా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు ఎల్లసిరి గోపాలరెడ్డి, జిల్లా నాయకులు మల్లు విజయకుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, రాధారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో

# మట్టి వినాయక ప్రతిమలు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ సంఘాల సభ్యులు

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 2న గూడూరులోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణసేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. స్థానిక గాంధీబొమ్మ సమీపంలోని కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించుకోవాలని సూచించారు. సంఘం కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, కమిటీ సభ్యులు పురుషోత్తం, డి. శ్రీనివాసరావు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి - డాక్టర్ రోహిణి




శిక్షణ పొందిన మహిళలతో డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి. రోహిణి అన్నారు. ఆంధ్ర మహిళామండలి ప్రాంగణంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఈనెల 1న సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ పొందినవారు సొంతంగా టైలరింగ్ చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారన్నారు. ఇప్పటివరకు సుమారు 5వేల మంది ఇక్కడ టైలరింగ్‌లో శిక్షణ పొందారని తెలిపారు. అనంతరం, వినాయకచవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవనిరెడ్డి, ప్రభారెడ్డి, సుప్రియ, విష్ణువందనతో పాటు ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# గౌడ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న సేవాసమితి నిర్వాహకులు

గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 1న గౌడ విద్యాసేవాసమితి ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా టిటిడి విజిలెన్స్ డిఎస్పీ తోట ప్రభాకర్ మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో టెన్త్‌లో 8.5 జిపిఏ, అంతకుమించి సాధించిన గౌడ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి ప్రోత్సాహకాలు అందుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు ఉప్పాల వాసుగౌడ్, నాశిన సుధాకర గౌడ్, చిరంజీవి గౌడ్, సుబ్రహ్మణ్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల్ని నాటడమే కాదు..

# ఎదిగేదాకా బతికించాలి

**- మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్**

మొక్కల్ని నాటడమే కాదు, వాటిని పెద్దవయ్యే దాకా బతికించుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ అన్నాడు.

ఈ నెల 31న నెల్లూరులోని కొత్తూరు ప్రాంతంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనేక మంది మొక్కలు నాటుతారని అయితే ఆ మొక్క బతికిందా లేదా అన్నది పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశాడు. లక్షల్లో మొక్కలు నాటుతున్నారని, అయితే ఎన్ని బతుకుతున్నాయన్న ఆలోచన మాత్రం చేయడం లేదన్నాడు. చెట్టు నరకడానికి ఒక అరగంట పడుతుందని, అదే చెట్టు పెరగడానికి ఎన్నో ఏళ్ళు పడుతుందని అంటూ అందరూ మొక్కలను నాటాలని, చెట్లను సంరంక్షించుకోవాలని అనిల్ అన్నాడు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళ ముందు ఒక మొక్క నాటి ప్రతిరోజూ వాటికి నీళ్ళు పోసి పెంచాలని, ఆ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించాడు. లెక్కల కోసమని లక్షల మొక్కలు నాటినట్లు చెప్పుకోవాల్సిన పని లేదని, బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని, పరిశుభ్రతను కాపాడుకోవాలని సూచించాడు. పరిశ్రమలు స్థాపించడం, రోడ్లు వెడల్పు చేయడం వంటి కొన్ని పనులతో వందల సంవత్సరాల నాటి చెట్లను కూడా నిలువునా కొట్టేసే పరిస్థితి ఏర్పడిందని, కానీ ఒక చెట్టు నాటి పెంచుకునేందుకు మాత్రం అశ్రద్ధ చేస్తున్నామని అంటూ.. మొక్కలు నాటడమే కాదు, అవి బాగా ఎదిగేవరకు బాధ్యత తీసుకోవాలని మంత్రి అందరికీ విజ్ఞప్తి చేశాడు



మొక్క నాటి నీళ్ళు పోస్తున్న మంత్రి అనిల్

## గుండాల నరేంద్రబాబుకు..

# 'గిడుగు' అవార్డు



తెలుగుభాషాభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్నవారికి ప్రదానం చేసే ప్రతిష్టాత్మకమైన గిడుగు రామ్మూర్తి పంతులు గారి అవార్డు ఈసారి నెల్లూరుకు చెందిన కవి గుండాల నరేంద్రబాబుకు లభించింది. గతనెల 30న ఆయన ఈ అవార్డును అందుకున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమ పితామహుడైన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గిడుగు ఫౌండేషన్ ఛైర్మెన్ కాంతికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బిక్కి కృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ప్రముఖ కవి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఛైర్మెన్ ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరుల ద్వారా ఆయన జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రాలతో ఈ అవార్డును అందుకున్నారు. నెల్లూరులోని కెఎన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నరేంద్రబాబు కవిగా, రచయితగా ప్రసిద్ధులు. ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డునందుకున్నందుకు నరేంద్రబాబు సన్నిహితులు, స్థానిక కవులు రచయితలు ఆయన్ను అభినందించారు.

# ప్రజాసంక్షేమం.. ఎల్ఐసి ధ్యేయం

**- ఎస్‌డిఎం ఎల్.సుందరరాజన్**

ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఎల్ఐసి పాలసీలు ప్రవేశపెడుతోందని, కేవలం వ్యాపార లావాదేవీలకే కాక ప్రజాసంక్షేమం కోసం ఎల్ఐసి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుతోందని నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల ఎల్ఐసి ఎస్‌డిఎం ఎల్.సుందరరాజన్ పేర్కొన్నారు. ఎల్ఐసి 63వ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 1న నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని 'సేవ్ వాటర్–సేవ్ లైఫ్' నినాదంతో కూడిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విద్యుత్తు, రక్షణ తదితర రంగాల్లో ఎల్ఐసి దాదాపు 28 లక్షల కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టిందని వివరించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్, ఎస్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌ను ప్రధానిగా చూడబోతున్న సోనియా

శ్రీను గల్పిక

*అది జీరో పొల్యూషన్ నగరంగా ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన ఢిల్లీ నగరం. టెన్‌జనపథ్‌లో పూజా మందిరం. ఆరోజు గణేష్ చతుర్ధి కావడంతో పూజామందిరాన్ని అరటిపిలకలు, మామిడి తోరణాలతో అలంకరించి వున్నారు. పూజగదిలో ఓ పీఠంపై బొజ్జగణపయ్య ప్రతిమను ప్రతిష్టించి వున్నారు. పూజామందిరం ముందు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులు అంబికా సోని, కుమారి షెల్జా, మల్లిఖార్జున ఖర్గే, అహ్మద్‌పటేల్, మనీష్ తివారి, దిగ్విజయ్‌సింగ్ వంటి నాయకులంతా కూర్చుని వున్నారు. వి. హెచ్.హనుమంతురావు వంటింట్లో చేసిన ఉండ్రాళ్ళు, పాయసం, పులిహోర, పొంగలి వంటి ప్రసాదం పళ్లేలను తెచ్చి పూజగదిలో పెట్టాడు. అంతా సెట్ చేశాక సోనియాగాంధీ గణేశ స్తోత్రాలు పఠించి పూజ చేసింది. ఆ తర్వాత "దండాలయ్యా ఉండ్రాలయ్యా దీవించయ్యా దేవా" అంటూ 'కూలీ నెం.1' సినిమాలోని పాటను పాడింది. సోనియాగాంధీ సినిమాలోని భక్తిపాట ఎందుకు పాడుతుందో అర్థం కాక మిగతా నాయకులు నివ్వెరపోయారు. పాట క్లైమాక్స్ కొచ్చేసరికి "ఇక ఆపు తల్లీ చాలు" అనే మాట వినిపించింది. సోనియా కళ్లు తెరచి చూసింది. ఎదురుగా వినాయకుడు. తొండం ఊపుతూ నిలబడ్డాడు. సోనియా ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసుకుని... స్వామి మీరు నిజంగానే వినాయకుడేనా... ఈ భక్తురాలి బాధను విని వచ్చారా అని అంది. అందుకు వినాయకుడు... నేను నీ బాధను విని రాలేదమ్మా... మీ పాట దెబ్బకు పక్కనున్న మీ వాళ్ళు పడుతున్న బాధ చూడలేక వచ్చాను. అయినా పాట ఎందుకు పాడినట్లు? అని ప్రశ్నించాడు. ఆ సంగతి తర్వాత చెబుతాగాని మీరు ఒరిజినల్ వినాయకుడేనా అని సోనియా ప్రశ్నించింది. ఆ డౌట్ ఎందుకొచ్చిందని వినాయకుడు ప్రశ్నించాడు. అందుకు సోనియా... నేను చూసిన ఫోటోలలో, విగ్రహాలలో వినాయకుడికి పెద్ద బొజ్జ వుంటుంది, నువ్వేమో స్లిమ్‌గా సిక్స్‌ప్యాక్ బాడీతో వున్నావు. అందుకే అనుమానంతో అడుగుతున్నాను అని అంది. దానికి విఘ్నేశ్వరుడు... మీ అనుమానం కరెక్టే తల్లి... మా అమ్మ నా చేత డైటింగ్ చేయిస్తుంది. మూడుపూటలా అవేవో చిరుధాన్యాలు మాత్రమే ఇస్తుంది. నాకిష్టమైన ఉండ్రాళ్ళు, చెరుకు గడలు బంద్ చేసింది. అంతే కాదు, ఉదయం, సాయంత్రం జిమ్‌లో చేర్చి ఎక్సర్‌సైజులు చేయిస్తుంది. వాటి దెబ్బకే ఆల్మట్టి డ్యాంలా వుండే నా పొట్ట కరిగి పంట కాలువంత అయ్యింది అని చెప్పి... ఇంతకీ మీ ప్రాబ్లమ్ ఏంటి అని అడిగాడు. నువ్వు చూడు నాయనా... చక్కగా మీ తల్లి మాట విని పొట్ట కరిగించుకున్నావ్... నా కొడుకు మాత్రం నా కోరిక తీర్చడం లేదు... అని సోనియా అంది. ఏంటో చెప్పు తల్లి ఆ కోరిక అని వినాయకుడు అడిగాడు. రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్నదే నా కోరిక అని సోనియా అంది. తథాస్తు తల్లి అని వినాయకుడు ఆశీర్వదించి మాయమయ్యాడు. సోనియా ఆశ్చర్యంతో మిగతా వారితో... ఆ వినాయకుడు చెప్పినంత సులభంగా మన రాహుల్ ప్రధాని అవుతాడంటారా అని అడిగింది. ఏమో తల్లి దైవ సంకల్పం వుండాలేగాని ఎందుకు కాకూడదు అని అందరూ కోరస్‌గా అన్నారు.*

★ ★ ★ ★ ★

*ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మల సీతారామన్, పీయుష్‌గోయల్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి వంటి నాయకులున్నారు. హోం మంత్రి అమిత్‌షా అందరికీ స్వీట్లు ఇస్తున్నాడు. మోడీ వుండి... ఏం అమిత్... ఆర్టికల్ 370 రద్దును విజయవంతంగా అమలు చేసినందుకా... ఈ స్వీట్లు అని అడిగాడు. అందుకు అమిత్‌షా... లేదు సార్, ఆర్టికల్ 370 రద్దును ఎక్కడ కాంగ్రెస్ పార్టీవాళ్ళు సమర్థిస్తారోనని భయపడ్డాను. ఆ రాహుల్ గాంధీ పుణ్యాన ఆ పార్టీ దీనిని వ్యతిరేకించింది. కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, శాంతి భద్రతలు అదుపులో లేవని ఆ రాహుల్ పదే పదే విమర్శిస్తున్నాడు. రాహుల్ పూర్తిగా ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా స్టాండ్ తీసుకున్నాడు. అందుకే ఆనందంతో ఈ స్వీట్స్ పంచుతున్నానని అన్నాడు. రాహుల్ దీనికి వ్యతిరేకంగా గళం విప్పితే అంతర్జాతీయ వేదికలపై మనకే ఇబ్బంది కదా అని రాజ్‌నాథ్‌సింగ్ అన్నాడు. ఇబ్బందో, మంచో ముందు ముందు మీరే చూస్తారు కదా అని అమిత్‌షా చెప్పాడు.*

★ ★ ★ ★ ★

*న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి కార్యాలయం. అన్ని దేశాల ప్రతినిధులు హాజరైవున్నారు. సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్ వచ్చి తన స్థానంలో కూర్చున్నారు. పాకిస్థాన్ ప్రతినిధి సయ్యద్ షా లేచి... సార్, జమ్మూ – కాశ్మీర్‌కు ఆర్టికల్370ని రద్దు చేసి భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. కాశ్మీర్ అంతర్జాతీయ సమస్య. దీనిపై వెంటనే ఐక్యరాజ్య సమితి చర్య తీసుకోవాలని కోరాడు. సమితి ప్రధానకార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్ వుండి... కాశ్మీర్ భారత్ అంతర్గత విషయమని మీరు తప్ప అన్ని దేశాలు చెబుతున్నాయి. అలాంటప్పుడు కాశ్మీర్‌ను అంతర్జాతీయ సమస్యగా ఎలా అంటారని ప్రశ్నించాడు. దానికి సయ్యద్ షా... అన్ని దేశాలు అనడం ఒకెత్తు... భారతదేశంలోని ప్రధాన ప్రతిపక్ష నేత అనడం ఓ ఎత్తు అంటూ ఆయన ఒక సిడిని ఇచ్చి... అది ప్లే చేయమన్నాడు. అప్పుడే ఒక స్క్రీన్ ఏర్పాటు చేయించి ప్లే చేయించాడు. స్క్రీన్‌పై రాహుల్ స్పీచ్.. కాశ్మీర్‌పై భారత్ వైఖరిని నిరసిస్తూ ఆయన చేసిన ప్రసంగం ప్రసారమైంది.*

★ ★ ★ ★ ★

*టెన్ జనపథ్ కార్యాలయం. సోనియాతో సహా కాంగ్రెస్ ముఖ్యనేతలంతా వున్నారు. అప్పుడే ఒక కాన్వాయ్ వచ్చి ఆగింది. అందులో నుండి పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ దిగాడు. నేరుగా లోపల కొచ్చాడు. ఏం ఇమ్రాన్‌జీ ఇలా అకస్మాత్తుగా వచ్చారని సోనియా అడిగింది. మీ కొడుకు రాహుల్ చేసిన నిర్వాకం మూలంగా రాక తప్పలేదమ్మా అని ఇమ్రాన్ అన్నాడు. ఇంతకీ ఏమైంది అని సోనియా అడిగింది. ఏమైందో నేను చెప్పడం కంటే మీరే చూడండి అని అక్కడే వున్న టీవీలో పాకిస్థాన్‌కు చెందిన 'పి'టివి ఛానల్ పెట్టాడు. ఆ ఛానెల్‌లో అప్పుడే కొన్ని దృశ్యాలు...*

*ఇస్లామాబాద్‌లోని పాక్ ప్రధాని కార్యాలయం ముందు కొన్ని లక్షల మంది పాకిస్థానీలు వున్నారు. అందరి చేతుల్లోనూ ప్లకార్డులు... వాటి మీద రాహుల్ ఫోటోలు... అందరి నోట... ప్రధానిగా ఇమ్రాన్ దిగిపోవాలి... రాహుల్ ప్రధాని కావాలి. అనే నినాదాలు పిక్కటిల్లుతున్నాయి.*

*సోనియా ఆ దృశ్యాలు చూసి ఆశ్చర్యపోయింది. ఏం జరుగుతుందక్కడ అని సోనియా ప్రశ్నించింది. కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్‌కు అనుకూలంగా నాకంటే మీ కొడుకు రాహుల్ వాదనే బలంగా వుందంట. అందుకే మావాళ్ళంతా మీ రాహుల్‌ను ప్రధానిగా కోరుకుంటున్నారు. మీవాడు మీ దేశంలో వెలగబెట్టలేక మా దేశంలో తల దూర్చి కంపు చేశాడు. మీ రాహుల్ వచ్చి ఇప్పుడు మా దేశంలో గనుక పోటీ చేస్తే రికార్డు మెజార్టీతో ప్రధాని అవుతాడు. నాకు డిపాజిట్ కూడా రాదు. మీవాడిని మా దేశ రాజకీయాల్లోకి రాకుండా చూడండి. అదే చెప్పిపోదామని వచ్చానని చెప్పి అక్కడ్నుండి బయల్దేరాడు.*

*అంతా విన్న సోనియా షాక్ నుండి తేరుకుని "ఓం వినాయక" అని గట్టిగా అరిచింది. క్షణాల్లో విఘ్నేశ్వరుడు ప్రత్యక్ష్యమయ్యాడు. స్వామీ, మావాడిని ప్రధానిని చేస్తానన్నది పాకిస్థాన్‌కా... ఇండియాకి కాదా? అని ప్రశ్నించింది. దానికి గణపయ్య... అదేంటి తల్లి... మీ వాడిని ప్రధానిగా చూడాలని వుందని అడిగావేకాని ఏ దేశానికి అన్నది పర్టిక్యులర్‌గా చెప్పలేదు కదా. అదీగాక ఈమధ్య మీవాడు పాకిస్థాన్‌పై ప్రేమ చూపిస్తుంటే ఆ దేశానికే ప్రధాని కావాలనుకుంటున్నాడేమో అనుకున్నాను. అదీగాక ఇండియా పిఎం పోస్ట్ ఇప్పట్లో వేకన్సీ అయ్యే పరిస్థితి కూడా లేదుగా.. ఇందులో నా పొరపాటేం లేదని చెప్పి మాయమయ్యాడు.*



తెలంగాణ గవర్నర్‌గా నియమితులైన తమిళిసైను, ఆమె భర్త ప్రొ. సౌందరరాజన్‌లను ఇటీవల చెన్నైలోని వారి నివాసంలో కలిసి అభినందిస్తున్న అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డా. సి.యం.కె.రెడ్డి

# విశ్వసాయిలో ఉపాధ్యాయ దినోత్సవం



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాశాల ఛైర్మెన్ ఎన్.సత్యనారాయణ

ఈ నెల 5వ తేదీన నెల్లూరు అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి జూనియర్ కాలేజీ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆయన రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా అందరికీ తెలుసని, వాటికంటే ముందు ఆయన ఉపాధ్యాయుడనేది అందరూ తెలుసుకోవాలన్నారు. నెల్లూరుజిల్లా సర్వేపల్లి ఆయన పూర్వీకులదని, ఆ ఊరి పేరే ఆయన ఇంటిపేరుగా మారిందన్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఆయన పేరు 11సార్లు నామినేట్ చేశారంటేనే ఆయన గొప్పతనం అర్ధమవుతుందన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్ ఆచార్య ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వై.వి.రామిరెడ్డి

విశ్వవిద్యాలయాలు మరియు ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ సైక్షిక్ మహా సంఘ్ జాతీయ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ ప్రొఫెసర్ వై.వి.రామిరెడ్డి ఒక వినతిపత్రంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌ను కోరారు. ఈ నెల 3వ తేదీన 25 ప్రధాన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య అందె ప్రసాద్‌కు ఆయన అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు విశ్వవిద్యాలయాల పరిధిలో అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడానికి సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నత విద్యారంగంలో పని చేస్తున్న అధ్యాపకుల పదవీ విరమణ వయసును 58 నుండి 60ఏళ్ళకు పెంచాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అధ్యాపకుల జీతాల్లో 80శాతం కేంద్రం భరించాలని, తాత్కాలిక అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని, జాతీయ ఆదాయంలో 10శాతాన్ని, రాష్ట్రాల బడ్జెట్‌లో 30శాతాన్ని విద్యారంగానికి కేటాయించాలనే డిమాండ్లు ఆ వినతిపత్రంలో వున్నాయి.

గురుపూజోత్సవం సందర్భంగా బుధవారం గూడూరులోని జివిఎస్ స్కూల్‌లో రిటైర్డ్ డిఆర్‌డబ్ల్యు కాలేజీ ఎకనమిక్స్ లెక్చరర్ శ్రీకంటి రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న ఆదిశంకర బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు.





వినాయకుని పూజలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్



గణనాథుని సేవలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

# జై! గణేశా!..జై జై గణేశా!...

- అంబరాన్నంటిన వినాయకచవితి సంబరాలు
- వాడవాడలా పూజలు.. ప్రత్యేక అలంకారాలు



విఘ్నేశ్వరుని పూజలో పాల్గొన్న మంత్రి అనిల్ తదితరులు

వినాయకచవితి వేడుకలు జిల్లాలో ఎంతో వైభవంగా జరిగాయి. అన్ని పట్టణాలు, గ్రామాలు.. ఏ వీధి చూసినా వినాయకచవితి కోలాహలమే కనిపించింది. ఎక్కడ చూసినా చిన్నాపెద్దా అందరూ కలసి ఆయా ప్రాంతాల్లో ఉన్న వినాయకుని ఆలయాలను సందర్శించుకున్నారు. సిద్ధిగణపతికి ఈ సందర్భంగా ఆలయాల్లో శోభాయమానంగా ప్రత్యేక అలంకారాలను నిర్వహించారు. ఇకపోతే, వినాయకచవితి వేడుకలను పురస్కరించుకుని వాడవాడలా ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాలను భక్తజనం ఎంతో ఆనందంతో తిలకించి పులకించిపోయారు. వాడవాడలా విద్యుద్దీపకాంతులతో, పుష్పమాలికలతో ఎంతో రమణీయంగా ఏర్పాటుచేసిన వినాయక మండపాలను, పెద్ద పెద్ద వినాయక విగ్రహాలను చూసి పరవశించారు. అనేకచోట్ల ఉట్టి మహోత్సవాలను నిర్వాహకులు వేడుకగా నిర్వహించారు. విభిన్నరీతుల్లో ఉన్న వినాయకుని విగ్రహాలకు కన్నులపండువగా అలంకారాలు చేసి విశిష్ట పూజలు చేశారు. ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుక లతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు, పప్పులవీధి, కాపువీధి ఇలా అనేకప్రాంతాల్లో ఉన్న వినాయకుని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వినాయకచవితికి ప్రత్యేకంగా ట్రంకురోడ్డు శివాజీసెంటర్, వేదాయపాళెం సెంటర్లలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహాలను భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



లంబోదరుని సేవిస్తున్న మాజీమంత్రి పి.నారాయణ

దంపతులు శివాజీసెంటర్‌కు విచ్చేసి వినాయకచవితి వేడుకల్లో పాల్గొని గణేశుని దర్శించుకుని పూజలు చేశారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్‌లు ఈ ప్రాంతాల్లో కొలువుదీర్చిన మహాగణపతిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు గణనాథునికి పూజలు చేశారు. అదేవిధంగా నగరంలోని ఆచారివీధి, చిన్నబజారు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండపాలను రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. కాపువీధిలో జరిగిన వినాయకుని పూజలో మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కుటుంబసభ్యులతో కలసి పాల్గొన్నారు. వేదాయపాళెం సెంటర్లో కొలువుదీరిన వినాయకుణ్ణి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు దర్శించుకుని పూజలు చేశారు. మూలాపేటలో ఏర్పాటుచేసిన వినాయకుని మాజీమంత్రి నారాయణ, మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు దర్శించుకుని పూజలు చేశారు. పెద్దబజార్‌లోని రాణాప్రతాప్ సెంటర్‌లో యువసేన ఆధ్వర్యంలో జరిగిన వినాయక ఉత్సవాలను మునిసిపల్ కమిషనర్ పివివిఎస్ మూర్తి ప్రారంభించారు. అనంతరం ఉత్సవాల వ్యవస్థాపకుడు నరసింహారావు జ్ఞాపకార్థం వస్త్రదానం, అన్నదానం నిర్వహించారు. నగరంలో వాడవాడలా ఎంతో కోలాహలంగా జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని మిత్రమండళ్ళ వారు, సేవాసంస్థల వారు ఈ సందర్భంగా అన్నదానాలు పెద్దఎత్తున నిర్వహించారు.

## కోలాహలంగా నిమజ్జనోత్సవాలు...

వినాయకచవితి సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో మూడు రోజుల పాటు పూజించిన వినాయకుని విగ్రహాలను, ప్రతిమలను మూడవరోజు బుధవారం సాయంత్రం నుంచి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తుల కోలాహలం మిన్నుముట్టింది. తప్పెట్లు తాళాలు, భాజాభజంత్రీలతో, నృత్యాలు చేస్తూ జై బోలో గణేశ్‌మహరాజ్‌కీ..జై అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ గణనాధుని ఊరేగింపులను భక్తజనం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని భక్తులు ఈ నిమజ్జనోత్సవాల్లో పెద్దసంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. పెన్నానది తీరంలోని జాఫర్‌సాహెబ్ కాలువలో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.

నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నిమజ్జనోత్సవాలకు భారీ క్రేన్‌లు ఉపయోగించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య, అశేష భక్తజనం మధ్య ఈ వేడుకలు జరిగాయి. నగరంలోని సంతపేటలో విక్రమసింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను ప్రముఖ స్వామీజీలు శ్రీ రామాయణం మహేష్‌స్వామి, శ్రీ దయానంద స్వామీజీ, శ్రీ రామానందతీర్థ స్వామీజీ, శ్రీ గోపీనాథానంద స్వామీజీ, శ్రీ ప్రభావతి మాతాజీలు ప్రారంభించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గురునిలయంలో వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురునిలయంలో గొలగమూడి వెంకయ్య స్వామి 37వ ఆరాధన మహోత్సవాలు ఈనెల3న భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారి నగర సంకీర్తనలతో భిక్షాటన కార్యక్రమం, స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామికి, గురునిలయం వ్యవస్థాపకులు వెంకయ్యస్వామి శిష్యుడు మాకాని వెంకట్రావు విగ్రహాలకు అభిషేకాలు, హోమాలు, సహస్ర నామార్చనలు, మహానివేదన, హారతులు, గురుదేవుల భక్త బృందంచే భజన సంకీర్తనలు, అఖండనామ సంకీర్తనలు జరిగాయి. 4వ తేది మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామివారి నగరోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమాలను మాకాని కుటుంబ సభ్యులు, అవధూతలు తలుపూరు నారాయణదాసు స్వామి, దేగపూడి సుబ్బారెడ్డి, గాలిపాళెం శ్రీహరిస్వామి, భక్త బృందం సభ్యులు మాకాని గోపి, మురళీ, నాగేంద్రసింగ్ తదితరులు పర్యవేక్షించారు.

# బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి సన్మానం



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి ఈనెల 3న కడప జిల్లా పోరు మామిళ్ళలో జరిగిన కార్యక్రమంలో సన్మానం అందుకున్నారు. ఓబులాపురంలోని వివేకానంద ఫౌండేషన్ సంస్థ 'సేవాభావం' అనే అంశంపై ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలస్థాయిలో కవితలను ఆహ్వానించగా మొత్తం 250 కవితలు వచ్చాయి. వాటిలో 26 ఉత్తమ కవితలను ఎంపికచేసి 'సేవాంజలి' పేరుతో కవితా సంపుటిని ప్రచురించారు. అందులో బొగ్గరపు కవిత కూడా ఎంపిక కావడంతో శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి సభకు అధ్యక్షత వహించగా, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి పాల్గొని కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటిసి, ఎంపిటిసిలతో పాటు సాహిత్యాభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 18, 19 తేదీల్లో వెంకటగిరి పోలేరమ్మ జాతర

## 15 నుంచి ఘటోత్సవం

భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతర పెద్దఎత్తున నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే ఈ జాతరలో జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు వెంకటగిరికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పోలేరమ్మ జాతరకు భక్తజనం తండోపతండాలుగా తరలి వస్తారు. దీంతో వెంకటగిరి భక్తజను లతో క్రిక్కిరిసిపోతుంది. ఏ వీధి చూసినా భక్తుల సందడితో కోలాహలంగా ఉంటుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన వెంకటగిరి పోలేరమ్మ జాతర ఎంతో సంప్రదాయ బద్ధంగా జరుగుతుంది. ఈ జాతర వైభవాన్ని కళ్ళారా తిలకించేందుకు భక్తజనులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకుంటుంటారు. అమ్మవారి జాతర సంబరం అంబరాన్ని అంటేట్టుగా ఉంటుంది.

వినాయక చవితి తర్వాత వచ్చే బుధవారం ఈనెల 4వతేది అర్ధరాత్రి జాతరకు తొలి చాటింపు జరిగింది. తప్పెట్ల మోతలు, కేరింతలతో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు తొలి చాటింపు వేశారు.

ఈనెల 11న రెండవ చాటింపు ఉంటుంది. ఆ తర్వాత 15వ తేది నుంచి ఘటోత్సవం ప్రారంభమవుతుంది. 18వ తేది రాత్రి అమ్మవారి నిలుపు, 19వ తేదిన నిమజ్జనం కార్యక్రమాలు లక్షలాదిమంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.

# పాత పాలకమండళ్ళకు చెక్ పెట్టారు!

తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వివిధ దేవస్థానాల పాలక కమిటీలను రద్దు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మన జిల్లాలోని ఆయా దేవస్థానాల పాలక వర్గ కమిటీలు రద్దయ్యాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందు జిల్లాలో కొన్ని దేవాలయాలకు కమిటీలు వేశారు. ఎన్నికల తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చింది. సాధారణంగా అయితే పాలక కమిటీలకు రెండేళ్ళ పదవీకాలం వుంటుంది. అయితే ప్రభుత్వాలు మారినప్పుడు కొత్త ప్రభుత్వం తమకు నచ్చిన వారితో పాలకవర్గాలను ఏర్పాటు చేస్తుంటుంది. మూడు నెలల క్రితం వైసిపి అధికారంలోకి వచ్చింది. దాంతో పెంచలకోన, నరసింహకొండ దేవస్థానాల ఛైర్మెన్‌లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. మిగతా దేవస్థానాల ఛైర్మెన్‌లు రాజీనామాలు చేయలేదు. రెండేళ్ళదాకా తమను తొలగించరులే అనే ధీమాతో కొనసాగుతున్నారు. ఎట్టకేలకు పాత పాలకమండళ్ళన్నీ రద్దయ్యాయి. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెంచలకోన, నరసింహకొండ, జొన్నవాడ, తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, మూలాపేట శివాలయం, సూళ్ళూరుపేట చెంగాళమ్మ దేవస్థానం వంటి 16 పెద్ద దేవాలయాలతో పాటు 340 వరకు వున్న చిన్న ఆలయాలకు కూడా త్వరలోనే పాలకవర్గ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

## మరణించినా కూడా జీవించాలంటే...

# నేత్రదానం చేయాలి



డా.జ్యోతిని సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

మరణించినా కూడా జీవించాలంటే నేత్రదానం చేయాలని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు అన్నారు. ఈనెల 4న ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి సహకారంతో జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బలరామయ్య నాయుడు నేత్రదాన అవగాహనపై కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు వాకర్స్ సభ్యులు 15 మంది తమ అంగీకారం తెలపడం సంతోషదాయకమన్నారు. అనంతరం మోడరన్ ఐ హాస్పిటల్ కార్నియా సర్జన్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ భారతదేశంలో కోటి మందికి పైగా అంధులు ఉన్నారని, ప్రతి సంవత్సరం నేత్రాలు అవసరమైన వారు రెండు లక్షల యాభైవేల మందికిపైగా వున్నారన్నారు. నేత్రదానం ఏ వయస్సు వారు చేసినా ఉపయోగపడుతుందని, మరణించిన తర్వాత 6గంటల నుంచి 8గంటలలోగా సేకరించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతిని వాకర్స్ సభ్యులు శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం దాదాపు 200 మందికి హాస్పిటల్ సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఐ బ్యాంక్ ఇన్‌చార్జ్ సురేష్‌కుమార్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, వీరిశెట్టి హజరత్‌బాబు తతదితరులు పాల్గొన్నారు.

# మేలుతున్న పవన్

(మొదటి పేజీ తరువాయి)

మార్చే ప్రయత్నాలలో వున్నారు. ఎవరు ఎలా వున్నా ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత చంద్రబాబు పట్ల అత్యంత భక్తి విశ్వాసాలు ప్రదర్శిస్తున్న వ్యక్తి ఒక్కడే ఒక్కడున్నాడు. ఆయనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్!

చంద్రబాబు ఐదేళ్ళ పాలనా కాలంలో మన పవన్‌కు అవినీతి, అక్రమాలు కనిపించలేదు. రాజధాని పేరుతో జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారంపై మాట్లాడాలని పించలేదు. రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కున్న ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దామనే ప్రయత్నం చేయలేదు. ఇసుక మాఫియా అధికారులను జుట్టు పట్టుకుని ఈడ్చిన సంఘటనను కనీసం ఖండించిన పాపాన పోలేదు. వేలకోట్లు దుబారా చేస్తుంటే చీమ కుట్టినట్లయినా స్పందించలేదు.

అప్పుడు ఏ అన్యాయం జరిగినా తెరచుకోని పవన్‌కళ్యాణ్ నోరు మూడునెలల జగన్ పాలనపై తెగ లేస్తోంది. మూడు నెల్లో ఎవరు అద్భుతాలు సృష్టించారు.. అయినా జగన్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 80శాతం వాటిని ఈ 3 నెలల్లోనే అమలులోకి తెచ్చాడు. ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతిని రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రభుత్వ శాఖలలో పారదర్శక పనితీరుకు కృషి చేస్తున్నాడు. ఇసుక విధానం కొంత ఆలస్యం కావొచ్చేమో.. కాని తక్కువ ధరకు ప్రజలకు ఇసుకను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చేస్తున్న మంచినంతా పవన్ వదిలేసి, చంద్రబాబు కొంప కొల్లేరయ్యిందని, రాజధాని మారిస్తే తెలుగుతమ్ముళ్ళ రియల్ వ్యాపారం పోతుందని బాధపడుతుండడం సిగ్గుచేటు! నిన్నటి ఎన్నికల్లో వైసిపిది ప్రజావిజయం. ప్రజలు ఇచ్చిన తీర్పు స్పష్టం. పవన్ కళ్యాణ్ దానిని వదిలేసి, ఇవిఎంల మాయాజాలంతో వైయస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాడని ఆరోపణ చేయడం ఆయన దివాళాకోరు తనానికి, ప్రజా తీర్పుపై గౌరవం లేదనడానికి నిదర్శనం!

# అవినీతిపై అంకుశమే!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ ఎవరి అహంకారం వల్ల జైలుకు వెళ్లాడన్నది అందరికీ తెలుసు. ఆయనపై పెట్టిన కేసులన్నీ కూడా కక్షతో కూడుకున్న వేనని తెలుసు. వై.యస్ ముఖ్యమంత్రిగా వుండగా ఒక్కరోజు కూడా సచివాలయానికి రాని, ప్రభుత్వ కార్యకలాపాలలో వేలుపెట్టని జగన్‌ను కేసుల్లో కావాలనే ఇరికించారన్నది జగమెరిగిన సత్యం.

తాను సీఎం అయితే నీతివంతమైన పాలన అందించాలన్నది జగన్ మొదటి నుండి చేస్తున్న ఆలోచన. ఒక సీఎం నీతి, నిజాయితీలతో పనిచేయడం ఎంతో కష్టసాధ్యమైన పని. ఉదాహరణకు ఒక చిన్న ప్రభుత్వ కార్యాలయాన్నే తీసుకుందాం. అందులో 50మంది ఉద్యోగులు వున్నారంటే, వారిలో ఒకరిద్దరు నిజాయితీపరులైన అధికారులుండి, మిగతా వాళ్ళను లంచాలు తినకుండా కట్టడి చేశారను కోండి... వాళ్ళందరికీ ఈ ఇద్దరూ శత్రువులైపోతారు. రాజకీయ వ్యవస్థలోనూ ఇదే సూత్రం అమలవుతుంటుంది.

జగన్ కావాలనుకుంటే రాష్ట్రంలో కాంట్రాక్టర్లందరినీ పిలిపించుకుని వుండొచ్చు... విద్యుత్ ప్రాజెక్టుల యజమానులనూ పిలిపించుకోవచ్చు... ఇసుక టెండర్లు, మద్యం డిస్టిలరీలు సొంతంగానే చేయొచ్చు. అమరావతి రాజధాని భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయొచ్చు. ఇలాంటి గబ్బు జోలికి జగన్ పోదలచుకోలేదు. పరిపాలన పారదర్శకంగా, నీతివంతంగా వుండాలనే దిశగా అడుగులు వేస్తున్నాడు. రివర్స్ టెండరింగ్, పిపిఏల పునఃసమీక్ష ద్వారా ప్రభుత్వ ఖర్చును తగ్గించే ప్రయత్నం చేస్తున్నాడు. గ్రామ సచివాలయం, గ్రామ వాలంటీర్ల వంటి పోస్టుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తూ లంచాలకు తావు లేకుండా చూస్తున్నాడు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయంలో లంచాల మాటే ఉండకూడదు అన్న దిశగా ప్రభుత్వ ఉద్యోగుల కోర్కెలు తీర్చడానికి కూడా సిద్ధమయ్యాడు. అయితే జగన్ నీతిగా ఉండాలనుకోవడం వల్ల ఆయన పార్టీలోని వాళ్ళే కాదు, ప్రభుత్వ వ్యవస్థల్లో వుండేవాళ్ళు కూడా ఎంతో ఇబ్బంది పడుతున్నారు.

ఇన్నేళ్ళుగా అవినీతి సొమ్ముకు అలవాటైన ప్రాణాలు ఇప్పుడు పూరకుండలేవు కదా! ముఖ్యంగా కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలే జగన్ నీతి కట్టుబాట్లపై అసంతృప్తితో వున్నారని సమాచారం. గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇసుక, మైనింగ్, ఉద్యోగుల బదిలీలు, భూములు వంటి వాటి రూపంలో అవినీతి సొమ్మును బాగా మెక్కారు. చంద్రబాబు అప్పుడు వాళ్ళ పార్టీ వాళ్ళకు ఫ్రీహ్యాండ్ ఇచ్చాడు.

ఇప్పుడు జగన్ నీతివంతమైన పాలన పేరుతో తన పార్టీ నేతల మూతులు కట్టేశాడు.. కుట్టేశాడు! అప్పటికీ కొంతమంది ఈ కట్టు, కుట్లు తెంపుకుని అడ్డదారి సంపాదనకు ఆత్రపడుతున్నారు. మరి తలో రకంగా వుండే మంత్రులు, ఎమ్మెల్యేలతో జగన్ నీతివంతమైన పాలనను ఎంతకాలం లాక్కురాగలడో చూడాలి!?

### ● ఆప్తులు, ఆత్మీయుల సాక్షిగా...

# మనసు విప్పి మాట్లాడిన వెంకయ్య



"ఆయన నెల్లూరు గడ్డపై జన్మించినప్పుడు పసిబాలుడు, ఉద్యమాలే ఊపిరిగా పోరాడినప్పుడు యువకుడు, క్రమశిక్షణ, పట్టుదల, కార్యదక్షతలే పెట్టుబడిగా ఎదిగినప్పుడు నాయకుడు, ఇప్పుడు భారతదేశంలోనే ద్వితీయపౌరుడు... ఆయనే ముప్పవరపు వెంకయ్యనాయుడు."

ఉపరాష్ట్రపతిగా మారిన ఉషాపతి తన రెండేళ్ళ పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఉపరాష్ట్రపతితో ఉపాహారం' కార్యక్రమంలో పాల్గొని ఇక్కడ జరిగిన 'ఆత్మీయ సదస్సు'లో మనసు విప్పి మాట్లాడారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకున్నారు. భారతీయ జనతాపార్టీలో తనతో పాటుగా కలసి పనిచేసిన సహచరులను పలకరించుకున్నారు. నెల్లూరులో తాను గడిపిన రోజుల్లో తనకు పరిచయమున్న వారందరితో ఈ వేడుకను వేదికగా చేసుకుని ముచ్చటించారు. ప్రతిఒక్కరినీ పేరుపేరునా పిలిచి తాను పులకించి వారిని తరింపజేశారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా తన చిన్ననాటి జ్ఞాపకాలను, మనుషులను మరువకుండా అందరి మనసులు దోచుకున్నారు.

రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకయ్య కుమార్తె దీపా వెంకట్ సారధ్యంలో సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం సాయంత్రం జరిగిన ఈ వేడుక రమణీయం.. కమనీయం... చిరస్మరణీయం. ముఖ్యంగా ఈ వేడుకలో వెంకయ్య మాటలు వజ్రాల మూటలుగా భావితరాలకు ఆదర్శబాటలుగా నిలిచాయంటే అతిశయోక్తి కాదేమో!

## గ్రామ బడిలో చదివాను..

తాను మహానగరాలలో అంతర్జాతీయ పాఠశాలలో చదవలేదని, గ్రామ బడి నుండే గ్రామర్ నేర్చుకుని ఈ స్థాయి గ్లామర్ తెచ్చుకున్నానని, తనకు చిన్ననాటి మిత్రులను కలవాలన్నా, తన ఆప్తులను ఆత్మీయులను కలిసి మాట్లాడాలన్నా ఎంతో ఇష్టమని, అలా కలిసినప్పుడు అందరితో మాట్లాడినప్పుడు నాకు ప్రాణవాయువు(ఆక్సిజన్) లభించినట్లు భావిస్తానని అంటూ వెంకయ్య తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నిత్యం ప్రజల్లో మమేకమై సమాజాన్ని చదివి, సమాజ సేవకుడిగా ఎదిగానని అన్నారు. అందుకే ఉపరాష్ట్రపతి పదవిలో వున్నా నిత్యం ప్రజల్లో వుండడానికే తపన పడుతూ ప్రజలకు అవసరమైన సేవలు అందించడానికి తాపత్రయపడుతున్నానని, ఈ క్రమంలోనే తాను దేశంలో ఏ ప్రాంతానికెళ్లినా అక్కడి ప్రజలను తన సహచర మిత్రులను, ఆప్తులను కలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నానని అన్నారు.

ఉపరాష్ట్రపతి పదవి అంటే ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన పదవిగా మార్చాలనే ప్రయత్నంలో ప్రజలకు ఆ పదవి చేరువ చేయాలని చూస్తున్నానని, సమాజానికి ఉపయోగపడేలా కార్యక్రమాలను చేపట్టడానికి వీలైన అంశాలను అవకాశాలను లోతుగా పరిశీలించి ముందుకు వెళ్తున్నానని అన్నారు. ప్రపంచాన్ని మరింతగా అధ్యయనం చేయాలంటే ఇతర దేశాలలో పాటిస్తున్న సంస్కృతి సంప్రదాయాలు, ఆయా దేశాల అభివృద్ధికి వారు చేపడుతున్న సంస్కరణలు బాగా అధ్యయనం చేయాలని, ఆ దృష్టితోనే తాను ఇప్పటికి 22 దేశాలు తిరిగానని అంటూ తాను ఎక్కడికి వెళ్లినా భారతదేశ సంస్కృతి గురించి మన దేశ కట్టుబాట్ల గురించి ఆయా దేశ ప్రతినిధులు కీర్తిస్తుంటే గర్వించానని అన్నారు.

## ప్రపంచమంతా సుఖశాంతులతో వుండాలి..

ప్రపంచం శాంతంగా ఉండాలని, సమైక్యంగా వుండాలని, భారతీయ జీవన స్రవంతి అయిన వసుదైక కుటుంబం, అలాగే సర్వేజన సుఖినోభవంతు వంటి ఆదర్శాలు ఆచరిస్తే ప్రపంచమంతా సుఖసంతోషాలతో విరాజిల్లుతుందన్నారు.

## 5 అంశాలపై దృష్టి పెట్టాను...

తాను ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్ళ కాలంలో 5 అంశాలపై దృష్టి పెట్టానని, మొదటిది విద్యారంగం, రెండవది సాంస్కృతిక రంగం, మూడవది వ్యవసాయ రంగం, నాలుగవది పరిశోధనా రంగం, 5వది సామాజిక వ్యాపార సంఘాల పనితీరు. ఇవన్నీ కూడా సమాజ శ్రేయస్సుకు దోహదపడే విభాగాలుగా భావించి, ముఖ్యంగా ఈ 5 రంగాలపై దృష్టిపెట్టి తన కార్యాచరణని రూపొందించుకుని దేశవ్యాప్తంగా తిరగడంతో పాటు ఇతర దేశాలలో కూడా పర్యటించానని అన్నారు. తాను ఆయా రంగాలలో ఎక్కడైనా సంస్కరణలు ప్రభుత్వ పరంగా అవసరమనిపిస్తే సంబంధిత మంత్రులతోనూ, ప్రధానమంత్రితోనూ అవసరమైతే రాష్ట్రపతి గారితోనూ మాట్లాడేవాడినని, సాధ్యమైనంత వరకు సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేసి తన పర్యటనకు సార్ధకతను చేకూరుస్తున్నానని అన్నారు.

## అనేక మార్పులు జరగాలి..

ఇంతటి అనుభవముండి స్వాతంత్ర్యం వచ్చి మరో మూడేళ్ళలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో, ప్రజాస్వామ్య దేశంలో పరిణితి చెందిన దేశంగా, లార్జెస్ట్ పార్లమెంటరి డెమోక్రసీగా వున్న మనం ఎన్నో మార్పులు చేసుకోవాల్సిన అవసరముంది. పరిపూర్ణ పరిపక్వత కలిగిన పార్లమెంట్ డెమోక్రటిక్ దేశంగా మనల్ని మనం సంస్కరించుకోవలసిన తరుణం ఇది అంటూ చట్టసభల్లో మార్పులు రావాలని, ప్రభుత్వ పాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో, పత్రికా రంగంలో అనేక మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని, మనందరి ఆలోచనా ధోరణి మారాలన్నారు.

## చారిత్రాత్మక నిర్ణయం 370 రద్దు

370 బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టే ముందురోజు రాత్రి తాను నిద్రపోలేదని, ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మకమైన బిల్లును తన ముందుంచి రాజ్యసభ ఛైర్మెన్‌గా ఆ బిల్లును ఆమోదింపజేసి పంపే బాధ్యత నాపై

**మనిషికి సంపద ముఖ్యం కాదు... సంతృప్తి, సంతోషం ప్రధానం. అవి రెండూ వుంటే ఆరోగ్యం బాగుంటుంది, మన ఆరోగ్యం బాగుంటే... మన దేశం బాగుంటుంది, మన దేశం బాగుంటే మనందరం బాగుంటాం...**

పెట్టిందని, ఆ తరుణంలో ప్రభుత్వం ప్రపోజ్ చెయ్యాలి, ప్రతిపక్షం అపోజ్ చెయ్యాలి, చివరిగా రాజ్యసభ డిస్పోజ్ చెయ్యాలి అన్న సూత్రంతో అత్యధిక మెజార్టీతో బిల్లును ఆమోదింపజేసి పంపించడం జరిగిందని అన్నారు. ఆర్టికల్ 370 అన్నది రాజకీయ అంశం కాదని, 1963లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన మంత్రిగా వున్న తరుణంలో 370ని తాత్కాలిక పరిష్కారంగా చూపించారే తప్ప శాశ్వత నిర్ణయంగా ఎక్కడా పేర్కొనలేదని అన్నారు.

## ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలి

ప్రజాప్రతినిధులు ఏ స్థాయిలో వారైనా సంయమనం పాటించాలని, ఓర్పుతో సమాజానికి సేవ చేయడానికి తమ పదవిని ఉపయోగించాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన ప్రతి పనిని నేటి పాలక పక్షం తప్పు పట్టడం, అలాగే నేటి పాలక పక్షం తీసుకునే అన్ని నిర్ణయాలను ప్రతిపక్షం ఎద్దేవా చేయడం మంచి సంస్కృతి కాదని సూచించారు.

## సంపద కాదు.. సంతోషం ప్రదానం

మనిషికి సంపద ముఖ్యం కాదని, సంతృప్తి, సంతోషం ప్రధానమని, అవి రెండూ వుంటే ఆరోగ్యం బాగుంటుందని, మన ఆరోగ్యం బాగుంటే మన దేశం బాగుంటుందని, మన దేశం బాగుంటే మనందరం బాగుంటామని అన్నారు. ప్రతి వ్యక్తీ ఈ దేశం కోసం, ఆరోగ్య భారత్ లక్ష్యంగా తన జీవితాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. తానెప్పుడూ తెలుగు ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా వుంటానని, ఇప్పటివరకు చేసిందేకాక ఇంకా భవిష్యత్‌లో తనకు చేతనైనంత స్థాయిలో తెలుగు ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని వెంకయ్య అన్నారు.

ఇలా అప్పుడప్పుడూ తన ఆప్తులందరినీ కలుసుకుని మాట్లాడితే తనకు ఊరట లభిస్తుందని మరోసారి పేర్కొంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు.

కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా॥ అనిల్, ఇంకా పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, నేతలు, కార్యకర్తలు, వెంకయ్య కుటుంబసభ్యులు, ఆయన ఆప్తులు, ఆత్మీయులు, చిరకాల మిత్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఓ కుటుంబ వేడుకలా జరగడం విశేషం.



## ఉపరాష్ట్రపతంటే ఆషామాషీ కాదు - విపిఆర్

ఉపరాష్ట్రపతంటే మనవాడే కదా, మన నెల్లూరువాడే కదా అని అందరూ అనుకుంటున్నారని, ఉపరాష్ట్రపతి అంటే ఆషామాషీ కాదని, భారత రాజ్యాంగ వ్యవస్థలో అత్యంత విలువైన రెండవ పదవి అని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమానికి స్వాగతోపన్యాసం చేస్తూ మన వెంకయ్య గారు ఛైర్మెన్‌గా వున్న రాజ్యసభలో తాను సభ్యుడిగా వుండడం చాలా సంతోషంగా వుందన్నారు. దేశంలోని అత్యంత కీలకమైన పదవిలో వున్న వ్యక్తి మన నెల్లూరీయుడు కావడం ప్రతి నెల్లూరీయుడు గర్వించే విషయమని అన్నారు. ఢిల్లీలో ఆయనను కలవాలంటే వందమందిని దాటి పోవాలని, వందల నియమనిబంధనలు అడ్డొస్తాయని, అలాంటి వ్యక్తి ఈరోజు నేరుగా మనందరి మధ్యకి వచ్చి మనల్ని కలుసుకోవడం వెంకయ్య గారికే సాధ్యమైందని, ఆయన వ్యక్తిత్వానికి ఇది నిదర్శనమని విపిఆర్ అన్నారు. భవిష్యత్‌లో రాబోయే ఉపరాష్ట్రపతులకు వెంకయ్యనాయుడు ఉదాహరణగా నిలుస్తారని, మార్గదర్శకం అవుతారని వేమిరెడ్డి అన్నారు.



## మా నాన్న ఎప్పటికీ జనం మనిషే - దీపావెంకట్

ఉపరాష్ట్రపతిగా ఉషాపతిని ఎంపిక చేసినప్పుడు అందరం ఆలోచనలో పడ్డాం. నాన్న ఇక ఎక్కువుగా ఇంట్లోనే వుంటారన్న సంతోషం ఓ వైపున వుంటే, నిత్యం ప్రజలతో మమేకమై ఉండే ఆయనకు ఈ పదవి ప్రజలని దూరం చేస్తుందా అన్న బాధ మరోవైపు వుండేది. అయితే ఈరోజు అందరి ఆలోచనలను పటాపంచలు చేస్తూ నాన్నగారు తానెప్పటికీ ప్రజల మనిషినే అన్నది రుజువు చేసుకోవడమే కాకుండా, ఉపరాష్ట్రపతి అంటే ఇలా వుండాలి, ప్రజలకు ఈ విధంగా సహాయపడాలి అన్న సందేశాన్ని భావిభారత ప్రజలకు ఇవ్వడం ఆనందకరమని వెంకయ్య కుమార్తె దీపమ్మ అన్నారు. మా నాన్న ఎప్పటికీ ప్రజల మనిషే అంటూ తన తండ్రిని ఆమె కీర్తించారు.





ఉపరాష్ట్రపతిగా వెంకయ్య రెండేళ్ళ ప్రస్థానానికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ఆహుతులందరూ తిలకించేలా ఏర్పాటు చేయగా, కార్యక్రమ అనంతరం 'ఉపరాష్ట్రపతితో ఉపాహారవిందు'ను నిర్వహించారు. ప్రాంగణంలో అడుగు పెట్టినప్పటి నుండి ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలుకరిస్తూ వారివారి టేబుళ్ళ దగ్గరికే ఆయన స్వయంగా వెళ్లి పలుకరించడం అందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. భారత ఉపరాష్ట్రపతి స్థాయి వ్యక్తి నేరుగా తమ వద్దకే వచ్చి పలుకరించడంతో ఆహుతుల ఆనందానికి అవధుల్లేవు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com